


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలో అధికారిక రికార్డులే విజయాలకు నిదర్శనం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తీసుకొచ్చిన పరిశ్రమలు, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ప్రైవేట్ ఉద్యోగాలపై ఇప్పటికీ సమాధానం లేదు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




మంగళవారం 01.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 132 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# భగీరథ ప్రయత్నం.. కృష్ణమ్మ సాక్షాత్కారం!

- వెలిగొండ జలాలకు జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల నిరీక్షణకు తెర.. తొలిదశ పనులు పూర్తి
- 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.. 4 లక్షల మందికి తాగునీరు
- 2028లో ఫేజ్-2 పూర్తి చేస్తామని సీఎం ప్రకటన



**మార్కాపురం, ఆగస్టు 31(జర్నలిస్ట్ ఫైల్) :** మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

**30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం :** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో మిగతా 2లో...





# ప్రజాభిప్రాయమే ప్రామాణికం

- డేటా అనలటిక్స్‌తో మరింత సమర్థంగా పౌర సేవలు
- ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలపై విస్తృత ప్రచారం
- ప్రజల భాగస్వామ్యంతోనే సానుకూల ఫలితాలు
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు మరింత మెరుగుపరచాలని, మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం సమీక్ష నిర్వహించారు. వెలిగొండ, అల్లూరి విమానాశ్రయ ప్రారంభోత్సవం లాంటి కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం పెద్దఎత్తున వచ్చిందని... దీనిని ఇతర అంశాలకూ వర్తింప చేయాలని సీఎం సూచించారు. ప్రత్యేకించి మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా వివిధ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇప్పటివరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తాను 20 సార్లు పాల్గొన్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పరిశుభ్రత అంశాలపై ప్రజల్లో మరింత లోతైన అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో శానిటేషన్ నిర్వహించే విషయంలో ఎలాంటి రాజీ లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో మెరుగ్గా శానిటేషన్ నిర్వహించాలని నిర్దేశించారు. ప్రతీ నెలా మొదటి ఆదివారం రోజున విద్యార్థుల తల్లిదండ్రుల్ని ఆహ్వానించి హాస్టళ్లలో పరిస్థితులు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్నా క్యాంటీన్ల ద్వారా దాతలు అన్నార్తులకు సాయం అందించే అంశాన్ని మిగతా 2లో...

# వైద్యానికి విశాఖ.. విశ్వస్థాయి వేదిక!


- ఏఐజీ ఆసుపత్రికి శంకుస్థాపన.. రూ.2 వేల కోట్ల పెట్టుబడి
- కేర్, ట్రైనింగ్, రీసెర్చ్‌తో సమగ్ర ఆరోగ్య వ్యవస్థ
- నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులోకి: లోకేశ్



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** విద్య, వైద్య రంగాలపై ప్రజాప్రభుత్వం ఎక్కువ దృష్టిసారిస్తుందని, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు చిరునామా ఏఐజీ హాస్పిటల్స్ అని, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఏఐజీ కృషిచేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ కు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. జీవితంలో విద్య, వైద్యం అనేది చాలా కీలకం. అందుకే నేను ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నాను. సమాజంలో మనం ఆశించే మార్పు విద్య ద్వారానే సాధ్యం. విద్య, వైద్య రంగాలపై ఎక్కువ శ్రద్ధ పెడతాం. ఇందుకు అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. మన కంటికి కనిపించే దేవుడు వైద్యుడు. వైద్యవృత్తి అంటే అందరూ హైఫై అనుకుంటారు. వాస్తవంగా డాక్టర్లు తమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేస్తారు. ఇంట్లో వివాహం జరుగుతున్నా అత్యవసరం అయితే వెళ్లాల్సిందే. వైద్యవృత్తి అనేది చాలా పవిత్రమైన వృత్తి. కరోనా సమయంలో నేను ప్రత్యక్షంగా చూశాను. లైఫ్ రిస్క్ చేసి డాక్టర్స్ పనిచేశారు. మిగతా 2లో...

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సి గుడ్‌బై

- అర్జెంటీనా స్టార్ ఆటగాడి సంచలన నిర్ణయం..
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన




**అర్జెంటీనా:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. అర్జెంటీనా తరఫున 207 మ్యాచ్‌లు ఆడి 125 గోల్స్ చేసిన మెస్సి.. తన నిర్ణయాన్ని అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించాడు. స్పెయిన్‌తో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో ఓటమి అనంతరం రెండు రోజులకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. మిగతా 2లో...

# ఇక దేశమంతా.. ఒకే సమయం!

- దేశవ్యాప్తంగా ఐఎస్‌టీ తప్పనిసరి
- బ్యాంకింగ్ నుంచి రైల్వేల వరకు.. ఇక టైమ్ తేడాలకు చెక్

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, బ్యాంకింగ్, డిజిటల్ సేవలకు ఇకపై ఒకే రకమైన సమయం నమోదయ్యేలా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. మిగతా 2లో...




# పరిశ్రమల్లో.. 33% పచ్చదనం తప్పనిసరి!

- కాలుష్య నియంత్రణకు మొక్కలు.. భావితరాలకు పచ్చని భవిష్యత్తు
- నిబంధనలు తు.చ. తప్పక పాటించాలి: పవన్ కల్యాణ్
- 2047 నాటికి రాష్ట్రంలో 50% పచ్చదనం లక్ష్యం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు. చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు.

అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రివర్యులు అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు మిగతా 3లో...



# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

- యుద్ధం ముగింపు, హర్మూజ్ జలసంధిపై చర్చలు
- శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు: మోదీ
- వాణిజ్య సంబంధాల విస్తరణకు కృషి

**కిర్గిస్థాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా కిర్గిస్థాన్‌లో ఇరువురు నేతలు ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ భేటీ కావడం ఇదే తొలిసారి. సమావేశంలో పశ్చిమాసియా పరిస్థితులు, యుద్ధాన్ని ముగించే మార్గాలు, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం తదితర కీలక అంశాలపై చర్చించినట్లు తెలిసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత మిగతా 3లో...

# రోశయ్య.. ఓ రాజకీయ పాఠశాల!

- సిరిపురం సర్కిల్‌లో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేశ్
- కష్టం, క్రమశిక్షణ, విలువలతో ఉన్నత స్థాయికి ఎదిగిన మహానేతగా ప్రశంస
- 18 నెలల్లో మ్యూజియం పూర్తి చేయాలని పిలుపు



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య. విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ..

**'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' :** "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్యులు మా ఆత్మగౌరవాన్ని గౌరవించాలని కోరారు. అందుకే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అమరావతిలో రికార్డు సమయంలో ఏర్పాటు చేసుకున్నాం. అది ఒక చరిత్ర. భూమి మేం ఇచ్చాం. నిధులు ఆర్యవైశ్య సోదరులే సమకూర్చి ఏర్పాటు చేశారు. మీరు కోరుకుంటే ఐక్యతతో నిలబడతారనే దానికి ఇది నిదర్శనం. ఇప్పుడు విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా చరిత్రలో నిలిచిపోయే రోజు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య పెద్దల ఆమోదంతో 'స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్' అని పేరు పెట్టుకున్నాం. అదే విధంగా రోశయ్య విగ్రహాన్ని చూసిన వెంటనే గుర్తొచ్చే పదం 'స్టేట్స్‌మన్'. అందుకే ఈ విగ్రహాన్ని 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' అని పిలుద్దాం" అని ప్రతిపాదించారు.

**వ్యక్తిగత విభేదాలకు దూరం.. రాజకీయ విలువలకు ప్రతిరూపం :** "రాజకీయ విలువల గురించి మాట్లాడాలంటే గుర్తొచ్చే పేర్లలో రోశయ్య ఒకరు. మిగతా 2లో...

## ప్రజాభిప్రాయమే ప్రామాణికం



(మొదటి పేజీ తరువాయి)

కూడా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోటు పాట్లను సవరించుకోవాలని సీఎం నిర్దేశించారు. బాధ్యులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయ్యి కృష్ణా నది జలాలు రావటంతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమైందని.. ప్రతీ కార్యక్రమంలోనూ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు.

**ఆన్ లైన్ సేవలు మరింత విస్తృతం :** అన్ని ప్రభుత్వ శాఖలూ ఆన్ లైన్ లో సేవలు అందించాలని సమీకృత సేవల విధానం ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సహా వివిధ విభాగాలు అన్ని ధృవపత్రాలనూ ఆన్ లైన్ లో జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అవేర్ ద్వారా రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రైతులకు సూచనలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం పెంచేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలు కాపాడుకోడానికి ప్రస్తుతం ఉన్న నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. భూమిని నిరుపయోగంగా ఉంచకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 5.70 లక్షల ఎకరాల్లో ప్రతీ ఎకరాను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సి గుడ్‌బై


(మొదటి పేజీ తరువాయి)

మెస్సి సారథ్యంలో అర్జెంటీనా 2022 ఫిఫా ప్రపంచకప్‌తో పాటు 2021, 2024 కోపా అమెరికా టైటిళ్లను సాధించింది. 2026 ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనా జట్టు రన్నరప్‌గా నిలిచింది. దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన మెస్సి.. రెండు దశాబ్దాలుగా జాతీయ జట్టుకు సేవలందించాడు.

**'జెర్సీ కోసం శక్తినంతా ధారపోశా' :** "అర్జెంటీనా జెర్సీ కోసం నా శక్తినంతా ధారపోశాను. జట్టుతో కలిసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాను. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందంగా ఉండేది. అయితే ఈ నిర్ణయం నా హృదయాన్ని ఎంతో బాధించింది. జాతీయ జట్టుకు అందించడానికి ఇక ఏమీ మిగలలేదు.

యువ ఆటగాళ్లు జాతీయ జట్టులోకి రావడానికి ఇదే సరైన సమయం. 20 ఏళ్లుగా నాపై చూపిన ప్రేమ, అభిమానానికి అర్జెంటీనా ప్రజలకు కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టును బయట నుంచి అభిమానించే సాధారణ అభిమానిగా ఉంటాను. నా కుటుంబం, కోచ్‌లు, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. జాతీయ జట్టుతో గడిపిన అనుభవాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. నన్ను అర్జెంటీనియన్‌గా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అని మెస్సి పేర్కొన్నాడు.

## ఇక దేశమంతా.. ఒకే సమయం!




(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ స్టాండర్డ్ టైమ్ ని ఏకైక ప్రామాణిక సమయంగా గుర్తిస్తూ లీగల్ మెట్రాలజీ-2026 నిబంధనల మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. అయితే, అధికారిక గెజిట్‌లో ప్రచురించిన 180 రోజుల తర్వాత ఇవి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక రంగాలు, సాంకేతిక సంస్థలు తమ నెట్‌వర్క్‌లను కొత్త వ్యవస్థకు అనుగుణంగా మార్చుకోవడానికి ఈ సమయాన్ని కేటాయించారు. బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, టెలి కమ్యూనికేషన్స్, రైల్వేలు, విమానయానం, పవర్ గ్రిడ్‌లు, కంప్యూటర్ నెట్‌వర్క్‌లు ప్రస్తుతం వేర్వేరు సమయ వనరులపై ఆధారపడటం వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడానికే 'ఇండియన్ స్టాండర్డ్ టైమ్' తీసుకువచ్చారు.

విదేశీ శాటిలైట్స్‌కు ఇక స్వస్తి..

ప్రస్తుతం దేశంలోని అనేక కీలక రంగాలు విదేశీ శాటిలైట్ ఆధారిత సమయ వనరులపై ఆధారపడుతున్నాయి. దీంతో ఆ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నది. ఇక నుంచి భారతీయ సంస్థలు, లీగల్ మెట్రాలజీ లాబొరేటరీల ద్వారా కచ్చితమైన ఐఎస్‌టీని అందించేందుకు ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చుకుంది. ఇందులో భాగంగానే భారత్ స్వదేశీ శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థ అయిన 'నావిక్' తో పాటు ఆమోదించబడిన ఇతర భారతీయ టైమింగ్ వనరులను సురక్షితమైన సమయ ప్రసారం కోసం ఉపయోగించనున్నారు.

సామాన్యులు, వ్యవస్థలకు జరిగే మేలు ఇదే..

'ఇండియన్ స్టాండర్డ్ టైమ్' తప్పనిసరి చేయడంతో యూపీఐ, నెట్ బ్యాంకింగ్ లావాదేవీలు జరిపే సమయంలో ప్రతీ సెకను సమయం కచ్చితంగా నమోదవుతుంది. దీంతో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సాంకేతిక లోపాల విచారణ సులభం అవుతోంది. ముఖ్యంగా రైల్వేలు, విమానాలు, బస్సుల రాకపోకల సమయాల్లో వ్యత్యాసాలు లేకుండా సిస్టమ్స్ అన్నీ ఒకే సమయంతో సింక్ అవుతాయి. అదేవిధంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలు, ఇంటర్నెట్ నెట్‌వర్క్స్, సైబర్ భద్రతా లాగ్స్‌లో కరెక్ట్ టైమ్‌తో సైబర్ దాడుల ముప్పు భారీగా తగ్గనుంది.

## మండలంలో పలు హాస్టల్లో తనిఖీ



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** ప్రతి విద్యార్థి సంతకం ఓ ఆటోగ్రాఫ్ కావాలని జిల్లా తెదేపా పార్టీ ఉపాధ్యక్షుడు కాలాల మల్లికార్జున రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం ఆయన బ్రహ్మంగారిమఠంలోని ఇంటిగ్రేటెడ్ సమీకృత వసతి సముదాయమును సందర్శించి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కావున ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జునరెడ్డిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ సంక్షేమ వసతి అధికారి మునెయ్య వార్డెన్ నరసింహారెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ ప్రయత్నం.. కృష్ణమ్మ సాక్షాత్కారం!

(మొదటి పేజీ తరువాయి)



పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం :** వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

**వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి :** "2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అ-రకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు.

**మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలు :** వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# రోశయ్య.. ఓ రాజకీయ పాఠశాల!


(మొదటి పేజీ తరువాయి)

నాకు ఎంతో ఇష్టమైన నాయకుడు, గొప్ప స్టేట్స్‌మన్ రోశయ్య. క్రమశిక్షణ, నిజాయతీ, సబ్జెక్టుపై పట్టు, మాటల్లో మంచితనం, విమర్శల్లో పదును ఆయన ప్రత్యేకతలు. పదవులు శాశ్వతం కాదు.. ప్రజలకు చేసిన సేవే శాశ్వతం అని నమ్మిన వ్యక్తి రోశయ్య. అధికారం ఉన్నప్పుడు అహంకారం ఉండదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉండేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రోశయ్య మాట్లాడుతుంటే అందరూ సైలెంట్‌గా వినేవారు. ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య ఒక వారధిగా ఉండేవారు. చంద్రబాబు, వైఎస్సార్ మధ్య ఎప్పుడైనా వాడివేడిగా వాదన జరిగినప్పుడు రోశయ్య నిలబడి కాస్త చల్లబరిచేవారు. మరుసటి రోజు బాబుకు ఫోన్ చేసి 'చాలా చక్కగా వాదనలు జరిగాయి.. ఇవాళ చర్చ కొనసాగిద్దాం' అని చెప్పేవారు. రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత గౌరవాన్ని కాపాడిన నాయకుడు రోశయ్య" అని అన్నారు.

**నేటి తరానికి ఆయనే స్ఫూర్తి :** "ఒక పల్లెటూరిలో సాధారణ కుటుంబంలో పుట్టారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఆచార్య ఎన్.జి. రంగా శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. పల్లెటూరు నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి రోశయ్య. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రులు మారినా ప్రతి కేబినెట్‌లో రోశయ్య కొనసాగేవారు. మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కమిట్మెంట్‌తో పనిచేశారు. ఆస్తులు, రాజకీయ నేపథ్యం లేకపోయినా కష్టం, క్రమశిక్షణ, విలువలు ఉంటే రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని రోశయ్య నిరూపించారు. ఆయన ఒక రాజకీయ పాఠశాల. నేటి తరానికి ఆయనే స్ఫూర్తి" అని అన్నారు.

**భావి తరాలకు ఆయన జీవిత చరిత్ర తెలియాలి :** "విగ్రహాలు కట్టడం వలన ఏం ఉపయోగమని చాలా మంది అపోహ పడుతుంటారు. కానీ నేను యువగళం పాదయాత్ర చేసే సమయంలో తెలుగుజాతి కోసం త్యాగాలు చేసిన ఎందరో మహానుభావుల గురించి వారి విగ్రహాలను చూసే తెలుసుకున్నాను. గొప్ప వ్యక్తులకు విగ్రహాలు ఏర్పాటు చేయడం గొప్ప నివాళి. అయితే అక్కడితో ఆగకూడదు. వారి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి. రోశయ్య జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, విజయాలు నేటి తరాలకు తెలియాలి. ఆయన జీవిత చరిత్రపై పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించి యువతకు చేరువ చేయాలి. వీటితోపాటు రోశయ్య జీవిత చరిత్ర తెలిపేలా ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆర్యవైశ్య పెద్దలంతా కలిసి ఆలోచించి మ్యూజియం కోసం స్థలం ఏర్పాటుచేయండి. కేవలం 18 నెలల్లో మ్యూజియం పూర్తి చేసి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దేశానికి అంకితం చేద్దాం. నేటి తరానికి కూడా బాల్యం నుంచే రోశయ్య జీవిత చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠ్యాంశాలలో ఆయన జీవిత చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి ఒక అధ్యాయం పెట్టించే బాధ్యత నాది. అలానే ఆయన అవలంబించిన రాజకీయ విలువలపై టీడీపీ క్యాడర్ ట్రైనింగ్‌లో కూడా ఒక చాప్టర్ పెట్టించే బాధ్యత పల్లా శ్రీనివాసరావుది. ప్రభుత్వం, ఆర్యవైశ్య పెద్దలు కలిసి రోశయ్య జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు.

విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని, ఇంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం తనకు దక్కడం



అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.

విగ్రహావిష్కరణకు ముందు రోశయ్య కుటుంబసభ్యులు పైడా కృష్ణప్రసాద్, పైడా రమాదేవి, పైడా మౌర్య, కొణిజేటి శివసుబ్బారావు, కేఎస్ఎన్ మూర్తితో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమాజ శ్రేయస్సు కోసం రోశయ్య చేసిన త్యాగాలు, అందించిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని కుటుంబసభ్యులకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైద్యానికి విశాఖ.. విశ్వస్థాయి వేదిక!

(మొదటి పేజీ తరువాయి)

కరోనా వస్తే చనిపోతామని తెలుసు. అప్పటికి ఇంకా వ్యాక్సిన్ కూడా రాలేదు. అయినా డాక్టర్స్ ఎవరూ వెనకడుగు వేయలేదు. ప్రజల ప్రాణాలు కాపాడారు. అప్పుడే మీపై గౌరవం పెరిగింది. ఒక కమిట్ మెంట్ తో మేం కూడా మీకు అండగా నిలబడతాం.

**కమిట్ మెంట్ తో పనిచేసే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి :** నాగేశ్వర్ రెడ్డికి, నాకు మధ్య ఎంతో అనుబంధం ఉంది. ఆయన ఎప్పుడు కలిసినా విమానంలోనే కలిసేవారు. సింగపూర్ కు ఓవర్ నైట్ కాన్ఫరెన్స్ కు వెళ్లి, ఆ కార్యక్రమం పూర్తిచేసుకుని తిరిగి వచ్చేవారు. కనీసం హోటల్ కు కూడా వెళ్లేవారు కాదు. కమిట్ మెంట్ తో పనిచేసే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి గారు. ఏఐజీ గురించి మాట్లాడితే ముందు ఒక అల్లరి పిల్లాడి గురించి మీకు చెప్పాలి. ఆ అల్లరి పిల్లాడు విశాఖపట్నంలోనే పుట్టాడు, ఇక్కడే పెరిగారు. చిన్న వయసులో ఆ కుర్రాడు చేసిన చిలిపి పనులు కొన్ని మీకు చెప్పాలి. పెట్రోల్ బర్న్ అవడం వల్లే కార్ రన్ అవుతుంది అని ఎవరో చెబితే ఆ కుర్రాడు విన్నాడు. అది నిజమో కాదో తెలుసుకోడానికి గ్యారేజీలో కారు ట్యాంక్ లోని పెట్రోల్ తీసి కింద పోసి నిప్పు అంటించాడు. చుట్టపక్కల వాళ్లు వచ్చి ఆ మంటలను ఆర్పేశారు. ఆ అల్లరి పిల్లాడు చేసిన ఇంకో చిలిపి పని గురించి మీకు చెప్పాలి. వాళ్ల నాన్న గారికి బట్టతల ఉంది. బార్బర్ కి డబ్బులు ఇవ్వడం ఎందుకు వేస్ట్ అని నాన్న గారు పడుకున్నప్పుడు వెంట్రుకలు కట్ చేశాడు. వైజాగ్ లో టింఫనీ హిల్స్ లోనే ఆ కుర్రాడు ఉండేవాడు. టింఫనీ హిల్స్ ఏరియాలో స్లోప్ ఎక్కువ ఉంటుంది. కారు గేర్ వేసి ఉండటం వల్లే ఆ స్లోప్ లో పార్క్ అవుతుందని ఎవరో చెప్పారు. అది నిజమో కాదో తెలుసుకోడానికి గేర్ తీసేశాడు. ఆ కారు కిందకు వెళ్లి డ్యామేజ్ అయింది. ఇంట్లో ఏసీ లేకపోతే చిన్న తమ్ముడిని ఫ్రిడ్జ్ లో పెట్టి డోర్ వేసి మర్చిపోయాడు ఆ అల్లరి పిల్లాడు. ఆ అల్లరి తట్టుకోలేక ఆ కుర్రాడిని వాళ్ల తాత గారు హైదరాబాద్ హెచ్ పీఎస్ లో జాయిన్ చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆ కుర్రాడి జీవితాన్ని మార్చింది. అల్లరి పిల్లాడు క్రమశిక్షణ కలిగిన కుర్రాడిగా మారాడు. ఆయనే డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి.

**పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రోఎంటరాలజీలో నాగేశ్వర్ రెడ్డి నెం.1గా ఎదిగారు :** అక్కడి నుంచి మొత్తం ప్రయాణం మారిపోయింది. కర్నూలు మెడికల్ కాలేజీలో మెడిసిన్



చేశారు. కుటుంబం అంతా పాథాలజీలో నిపుణులు కాబట్టి ఆయన కూడా పాథాలజీ వైపు వెళ్లాలని అనుకున్నారు. కానీ వాళ్ల తండ్రి ఒప్పుకోలేదు. ఇంటర్నల్ మెడిసిన్ చదివించారు. ఆ తర్వాత అసలు ఎవరికీ తెలియని గ్యాస్ట్రో ఎంటరాలజీ చదవారు. ఎవరికీ తెలియని గ్యాస్ట్రోఎంటరాలజీకి గుర్తింపు తీసుకురావాలనే పట్టుదలతో పనిచేశారు. గ్యాస్ట్రోఎంటరాలజీలో నేడు ప్రపంచంలో నెం.1 స్థానం సంపాదించిన గొప్ప డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి గారు.

**సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు చిరునామా ఏఐజీ :** ఏఐజీ మరొక కార్పోరేట్ ఆసుపత్రి కాదు. ప్రపంచస్థాయి వైద్యం నిరుపేదలకు ఎలా అందించాలని ఆలోచించే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి గారు. నా రక్తపరీక్షలన్నింటికీ నేను ఏఐజీకే వెళ్తాను. సాంకేతిక వినియోగంతో పాటు పరిశోధనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు చిరునామా ఏఐజీ. నిరుపేదలకు అద్భుతమైన వైద్యం అందిస్తున్న దేవాలయం ఏఐజీ. నాగేశ్వర్ రెడ్డి గారికి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ ఇచ్చినా తక్కువే. ఆయన నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. కేవలం ధనవంతులు గురించి కాదు.. నిరుపేదల గురించి ఆలోచిస్తారు. నగదు ఉన్నా లేకపోయినా అందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనేదే ఆయన ఆలోచన.

**ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్ గా విశాఖను తీర్చిదిద్దుతాం :** ప్రభుత్వపరంగా ఏఐజీ హాస్పిటల్స్ కు అన్ని విధాల సహకారం అందిస్తాం. విశాఖకు వచ్చినందుకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాం. ఇది భవిష్యత్ నగరం. ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్ గా విశాఖను తీర్చిదిద్దుతాం. మీరు సరైన సమయంలో సరైన ప్రాంతాన్ని ఎంచుకున్నారు. అందరం కలిసికట్టుగా నాణ్యమైన వైద్యసేవలు అందిద్దాం. ఇది కేవలం పెట్టుబడి మాత్రమే కాదు.. జీవితాలనే మార్చివేసే సందర్భం. ఏఐజీకి 32 ఏళ్ల చరిత్ర ఉంది. 1400 పడకలు, 350 ఐసీయూ పడకలు, 600 మంది డాక్టర్లు, 10 లక్షల మంది రోగులకు చికిత్స అందించారు. విశాఖలో రూ. 2వేల కోట్ల పెట్టుబడి, వెయ్యి పడకల సామర్థ్యంతో కేర్, ట్రైనింగ్, రీసెర్చ్ తో పూర్తిస్థాయి హెల్త్ కేర్ ఎకోసిస్టమ్ ను నిర్మిస్తున్నారు. అవుట్ పేషంట్ బ్లాక్ రోజుకు 5వేల కెపాసిటీతో ఏర్పాటుచేస్తున్నారు. 50 స్పెషాలిటీలు నెలకొల్పుతున్నారు. 9వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. వెయ్యి మంది వైద్యులు సేవలు అందిస్తారని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి గారు ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయనకున్న నాలెడ్జ్, కమిట్ మెంట్ అలాంటిది. ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీలో ఉండగా నేను అనారోగ్యానికి గురయ్యాను. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి గారు నాకు మంచి వైద్యం అందించి ప్రాణాలు నిలిపిన పరిస్థితి. ఆయన చేసిన సేవలకు గాను మూడు పద్మఅవార్డులు అందుకున్నారు. పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. విశాఖకు ఏఐజీ ఆసుపత్రి రావడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు విశాఖపట్నం వైద్యచికిత్స రంగంలో చారిత్రక ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది భావోద్వేగ సమయం. నేను విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో జన్మించాను. నా జీవితంలోని తొలి ఆరేళ్లు ఇక్కడే గడిచాయి. నా బాల్య స్మృతులు ఇక్కడే ఉన్నాయి. విశాఖ బీచ్‌లు, అప్పట్లో ఇక్కడ ఉన్న టెన్నిస్ క్రీడా సౌకర్యాలు, అప్పటి వాతావరణం.. అన్నీ నాకు ఎంతో ఇష్టం. హైదరాబాద్‌లో ఏఐజీ హాస్పిటల్‌ను ప్రారంభించి, దానిని అభివృద్ధి చేసిన తర్వాత, విశాఖపట్నానికి రావాలని కోరిక ఉండేది. ఇక్కడికి తిరిగి వచ్చి ఏదైనా చేయాలని ఉండేది. సీఎం చంద్రబాబు గారు, మంత్రి లోకేష్ సహకారంతో అది సాకారమైంది. ఏఐజీ హైదరాబాద్ తక్కువ సమయంలోనే ప్రపంచ అగ్రశ్రేణి ఆసుపత్రుల్లో ఒకటిగా నిలిచింది. గత మూడేళ్లుగా ప్రపంచంలోని ప్రముఖ మ్యాగజైన్ లు న్యూస్ వీక్, టైమ్.. మమ్మల్ని ప్రపంచంలోని అత్యుత్తమ ఆసుపత్రుల్లో ఒకటిగా పేర్కొన్నాయి. ముఖ్యంగా గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో హార్వర్డ్, స్టాన్ ఫోర్డ్ వంటి ప్రముఖ సంస్థలతో కలిసి మేం 5వ స్థానంలో ఉన్నాం. మా బృందం సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యమైంది. అన్ని వర్గాల రోగులకు సమానమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగాం. మేం ఎప్పుడూ టార్గెట్లు నిర్ణయించలేదు. ఏఐజీ హాస్పిటల్స్‌కు నైతిక విలువలే పునాది. ఆ తర్వాత మేం పరిశోధనపై దృష్టి పెట్టాం. విశాఖలో మేం ఒక సాధారణ కార్పోరేట్ ఆసుపత్రిని నిర్మించడం లేదు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ఆసుపత్రిని నిర్మించబోతున్నాం. ఇక్కడికి వచ్చే రోగులకు ఖర్చు ఒక సమస్యగా మారకుండా చూసుకుంటాం. రోగులకు కేవలం చికిత్స అందించడమే కాకుండా, నైతిక విలువలకు కట్టుబడి చికిత్స అందించే ఆసుపత్రిగా దీనిని తీర్చిదిద్దుతాం. ఈ ఆసుపత్రి చికిత్స అందించడంతో పాటు పరిశోధనలు నిర్వహిస్తుంది. పెద్ద సంఖ్యలో వైద్యులు, టెక్నీషియన్లు, నర్సులకు శిక్షణ అందిస్తుంది. ఇందుకోసం మాకు తగినంత స్థలం కూడా ఉంది. ఇక్కడ శిక్షణ పొందిన వారు భవిష్యత్తులో ఈ రంగంలో నిష్ణాతులుగా ఎదుగుతారు. విశాఖపట్నంలోని ఈ ప్రాంతం దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలకు ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. ప్రస్తుతం ప్రజలు వైద్య చికిత్స కోసం ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తున్నారు. ఇకపై వారు విశాఖపట్నానికి వస్తారు. విశాఖపట్నాన్ని ఒక మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు.

# రెండేళ్ల పాలనలో సంక్షేమం-అభివృద్ధికి పెద్దపీట

## ప్రజల వద్దకే ప్రభుత్వం.. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్













**తెనాలి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల వద్దకే ప్రభుత్వం అనే విధానంతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ, తెనాలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తెనాలిలోని చినరావూరుతోట 14వ వార్డులో సోమవారం నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిందని, అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఆలపాటి అన్నారు. 'తల్లికి వందనం', సామాజిక భద్రతా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని చెప్పారు.

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.







## పరిశ్రమల్లో.. 33% పచ్చదనం తప్పనిసరి!

(మొదటి పేజీ తరువాయి)

33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్లు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు.

## ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

నెలకొల్పేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను భవిష్యత్‌లో మరింత విస్తరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

**'యుద్ధం కోరుకోవడం లేదు' :** అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో భాగంగా పెజెష్కియాన్ ఎస్-సీఓ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ దేశం యుద్ధాన్ని కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తమపై దురాక్రమణను మాత్రం సహించబోమని హెచ్చరించారు. 'బలంతో, దృఢ నిశ్చయంతో ప్రతిస్పందిస్తాం' అని పెజెష్కియాన్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రపంచ దేశాల మధ్య సమన్వయం మరింత అవసరమని పేర్కొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలలో అధికారుల పనితీరు కొలమానం మెరుగ్గా ఉండాలి



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** అభివృద్ధి కార్యక్రమాలలో అధికారుల పనితీరు కొలమానం అత్యంత మెరుగ్గా ఉండాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి స్పష్టం చేశారు. సోమవారం నాడు స్థానిక కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో పి-4 కేపీఐఎస్ పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, నెలవారీ ఆర్థిక నివేదికలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఆదాయ వనరులను పెంచుకోవడం, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రామాణికంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.

నెలవారీగా నియోజకవర్గ స్థాయిలో 15 అంశాలలో, ఏడాదికి జిల్లా స్థాయిలో 352 అంశాలలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ గుర్తుచేశారు. కేవలం ప్రేరణ కల్పించడం, శిక్షణలు, అవగాహన కార్యక్రమాలతోనే సరిపెట్టకుండా అధికారులలో నిబద్ధత, సూక్ష్మ ప్రణాళిక ఉన్నత లక్ష్య సాధన అనే తపన ఉండాలని సూచించారు.

సచివాలయాల ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలపై ప్రజల స్పందనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని, నియోజకవర్గ స్థాయిలో అధికారులు, సీవీఐపీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సీపీఓ షాలేము రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, డీపీఓ ప్రభాకర్ రావు, సీపీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండను జలవనరులతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- **శ్రీశైలం-త్రిపురాంతకం-కంభం-భైరవకోన-నల్లమలను కలుపుతూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్**
- **రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్**



**వెలిగొండ(జర్నలిస్ట్ ఫైల్) :** పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును కేవలం జలవనరుల ప్రాజెక్టుగా కాకుండా ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వెలిగొండ జలసిరులతో పాటు ఉమ్మడి ప్రకాశం ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి కొత్త ఊపునిస్తామని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం గంటవానిపల్లి సమీపంలోని వెలిగొండ ఫీడర్ కెనాల్ వద్ద సోమవారం నిర్వహించిన వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ నీటి విడుదల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ నీటి విడుదల చారిత్రాత్మక ఘట్టమని మంత్రి అన్నారు. 1996లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో ఆయన చేతుల మీదుగా తొలి దశ నీటి విడుదల జరగడం విశేషమన్నారు. ఉమ్మడి ప్రకాశం ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న సమర్థవంతమైన పాలనకు ఇది నిదర్శనమన్నారు.

కేరళలో చికిత్స పొందుతున్నప్పటికీ వెలిగొండ ప్రాజెక్టు చారిత్రాత్మక వేడుకను వీడియో ద్వారా వీక్షించి శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. నదుల అనుసంధానం, పారిశ్రామిక, సాంకేతిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం దూరదృష్టితో పనిచేస్తోందన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు నీటి విడుదలకు ముందే పరిహారం అందించడం కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. రైతులు, నిర్వాసితులు అందించిన సహకారం అభినందనీయమన్నారు.

సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా శ్రీశైలం, త్రిపురాంతకం, కంభం చెరువు, భైరవకోన, నల్లమల అటవీ ప్రాంతం, మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయం తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. నల్లమల ఫారెస్ట్ సఫారీ వంటి పర్యాటక ఆకర్షణలను కూడా అభివృద్ధి చేసి 'టూరిజం కారిడార్'గా వెలిగొండ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు పర్యాటక రంగంలో పెద్దఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఎండిపోయిన ప్రాంతాలకు జలసిరులు అందడంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం ఉద్యమించిన పూల సుబ్బయ్య పేరు పెట్టడం సముచిత గౌరవమన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం, మార్కాపురం, ప్రకాశం, కంభం తదితర ప్రాంతాలను అనుసంధానించే పర్యాటక సర్క్యూట్ ప్రణాళికకు సంబంధించిన బ్రోచర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మంత్రి దుర్గేష్ ఆవిష్కరింపజేశారు.

## నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



**పెదనందిపాడు (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పెదనందిపాడులో రూ. 1.93 కోట్లతో నిర్మించనున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక వైద్యం, ప్రసవ సదుపాయాలు, అత్యవసర చికిత్సలు అందుబాటులో ఉండేలా నూతన ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన ఆసుపత్రులపై రోగుల భారం తగ్గాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో నిర్మించిన భవనం రూఫ్, స్లాబ్‌లలో లోపాలు ఉండటంతో పాటు ఉప్పునీటి సమస్య కారణంగా భవనం పటిష్టత దెబ్బతిన్నదని, అందుకే ప్రత్యామ్నాయంగా కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. భవనంలో చిన్నచిన్న మరమ్మతులు ఉన్నాయని ప్రజలు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఒక్క వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షం

- **సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు**
- **విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు**
- **విశాఖ అభివృద్ధి మన బాధ్యత.. ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఏ కార్యక్రమం చేయబోం**
- **హరే కృష్ణ గోకుల్ ట్రస్ట్, ప్రేమ ఉదయం, ఏజ్ కేర్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో మంత్రి నారా లోకేష్**
- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి లోకేష్**




**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రేమ ఉదయం & ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలోని గంభీరం వద్ద నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి నారా లోకేష్‌కు నిర్వాహకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కిచెన్‌ను పరిశీలించారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణాని భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఆలయానికి సంబంధించిన ప్రత్యేక ఏవీని మంత్రి లోకేష్ తిలకించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్‌ను నిర్వాహకులు సత్కరించారు.

అనంతరం ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, నూతన కాలేజీ భవనాలను పరిశీలించారు.

అనంతరం ఏజ్ కేర్ ఫౌండేషన్/స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ జెరియాట్రిక్ & పాలియేటివ్ కేర్ సెంటర్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డోనర్ గ్యాలరీని సందర్శించారు. ఏజ్ కేర్ ఫౌండేషన్ భవనంలోని 4వ అంతస్తు, 5వ అంతస్తును మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... దివంగత పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఒక వ్యక్తి చేసిన దానం నేడు అనేక మందికి ఉపయోగపడే మహావృక్షంగా మారిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆదినారాయణరావు గారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ భూమిలో కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**విలువలతో కూడిన విద్యే నిజమైన అభివృద్ధి :** "సమాజంలో తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసే పరిస్థితులు బాధాకరం. ఇటువంటి రోజుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం అభినందనీయం. నేను మీకు చేయగలిగింది ఒకటే. పిల్లలకు అంగన్‌వాడీ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కేవలం విద్యను అందించడం కాకుండా విలువలు, నైతికతతో కూడిన విద్య అందించాల్సిన బాధ్యత విద్యాశాఖ మంత్రిగా నాపై ఉంది" అని అన్నారు.

**విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు :** "చాగంటి కోటేశ్వరరావు గారికి కేబినెట్ ర్యాంక్‌తో అడ్వైజర్ బాధ్యతలు అప్పగించినా, ఆయన ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోలేదు. పిల్లలకు విలువలు నేర్పే పుస్తకాలను రూపొందించి వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలని మాత్రమే ఆయన కోరారు. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే చాగంటి కోటేశ్వరరావు మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉండాలి" అని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

**వృద్ధులకు గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలి :** "వృద్ధులను గౌరవంగా చూసుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ అందిస్తోంది. వృద్ధులు సమాజంలో గౌరవంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు గారి ఆలోచన" అని పేర్కొన్నారు.

**దాతల సేవలకు అభినందనలు :** "సేవా కార్యక్రమాలకు విరాళాలు అందించిన దాతలందరూ సమాజానికి మార్గదర్శకులు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయం. పాలియేటివ్ కేర్ సెంటర్ రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదిగా నిలుస్తుంది. ఇది దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచేలా అందరం కలిసి పనిచేయాలి. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణం ఒక చక్కటి ఉదాహరణ. యువత కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**విశాఖపట్నం అభివృద్ధి మన బాధ్యత :** రాష్ట్ర విభజన తర్వాత విశాఖపట్నానికి ఎంతో చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. విశాఖ ఎకనామిక్ రీజియన్ దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకనామిక్ రీజియన్‌గా మారుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని అన్నారు.

**డేటా సెంటర్ల విషయంలో అపోహలు వద్దు :** "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పుడు వచ్చే అపోహలను తొలగించి ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. డేటా సెంటర్ల విషయంలో కూడా కొన్ని అపోహలు ఉన్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్ల విషయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తాం. నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని అన్నారు.

**దేశంలో విశాఖను నంబర్ వన్ సిటీగా నిలబెడతాం :** "విశాఖపట్నం వేగంగా రూపాంతరం చెందుతోంది. ఏఐజీ హాస్పిటల్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. రెండేళ్లలో 650 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుంది. హైదరాబాద్‌ను చంద్రబాబు గారు అభివృద్ధి చేసిన విధంగా విశాఖపట్నం అభివృద్ధిలో కూడా ఒక కొత్త బెంచ్‌మార్క్ సృష్టించబోతున్నాం. విశాఖపట్నం నంబర్ వన్‌గా ఉండాలి. దేశంలోని మోడల్ సిటీల్లో ఒకటిగా విశాఖను అభివృద్ధి చేస్తాం" అని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని, ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని మంత్రి లోకేష్ అన్నారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫ్రీ పోలియో సర్జికల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, విశాఖ హరే కృష్ణ మూవ్ మెంట్ అధ్యక్షులు నిష్కించన భక్త దాస, ఫౌండేషన్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర నియోజకవర్గంలో పలు శుభకార్యాలు

- పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్




**దేవరకద్ర, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర, భూత్పూర్, కొత్తకోట మున్సిపాలిటీలు, అడ్డాకుల, మదనాపూర్, కొత్తకోట గ్రామీణ మండలాలలో పలు వివాహాలు, గృహ ప్రవేశాలలో పాల్గొన్న దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి. శ్రవణమాసం సందర్భంగా శుభకార్యాలు ఊపందుకున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిమ్మెర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను,వారి కుటుంబ సభ్యులను అభినందించి, వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. పేద కుటుంబాలకు సొంతిం టి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జిమ్మెర్ పేర్కొన్నారు.

### పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా

## ఎన్నికైన కుచన రవీందర్‌కు ఘన సన్మానం



**నర్సంపేట ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కుచన రవీందర్ ని 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పొన్నాల మనీషా ప్రకాష్ మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కుచన రవీందర్‌కి అభినందనలు తెలియజేస్తూ, సంఘ అభివృద్ధికి, పద్మశాలి సమాజ సంక్షేమానికి ఆయన తన సేవలను మరింత విస్తృతంగా అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరంగంటి కుమార్, ప్రధాన కార్యదర్శి శివరాత్రి నాగరాజు, అధ్యక్షులు దారంగుల కొమురయ్య, ఆకులపల్లి రమేష్, యూత్ ప్రెసిడెంట్ జన్ను శ్రవణ్, మైనారిటీ ప్రెసిడెంట్ ఎస్.డి. జావీద్, ఉపాధ్యక్షులు మాసు స్వామి, వల్లెపు విష్ణు, యూత్ వైస్ ప్రెసిడెంట్ :ధరంగుల సాయి కుమార్ సహాయ కార్యదర్శి: రామకృష్ణ రాపోలు మరియు కోరుపోజు దామోదర్, నల్ల శ్రీను, మహేష్ తదితరులు పాల్గొని కుచన రవీందర్ కి శుభాకాంక్షలు తెలిపారు.

### ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసిన

## నూతన పట్టణ పద్మశాలి సంఘ బాధ్యులు



**నర్సంపేట ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘ ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికైన కుచన రవీందర్, ప్రధాన కార్యదర్శి పెండెం భాస్కర్, కోశాధికారి గాజుల రాము గార్లతో పాటు నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం బాధ్యులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి త్వరలో జరగబోయే ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని ఆహ్వానించడం జరిగింది.అనంతరం నూతనంగా ఎన్నికైన పట్టణ పద్మశాలి సంఘ బాధ్యులను శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పద్మశాలి సంఘ బాధ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, అదే విధంగా పద్మశాలి సంఘాన్ని కుల బాంధవుల సహాయ సహకారాలతో అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణం మొక్కులు

- ఆఖరి శుక్రవారం ముత్యాలమ్మ గద్దెలకు పోటెత్తిన భక్తులు...




**వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ముత్యాలమ్మ గద్దల వద్ద భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో చేరి అమ్మవారి మొక్కలను తీర్చుకున్నారు. తమను తమ కుటుంబాలను చల్లగా దీవించాలని, పాడిపంటలు పండి తమ గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలంటూ మొక్కులు మొక్కుకున్నారు. ఆయా గ్రామాల్లోని ముత్యాలమ్మ గద్దెల వద్ద జనాలు బారులు తీరారు. డప్పు వాయిద్యాల నడుమ పూనకాలతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మను దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. భక్తుల కోలాహలంతో ముత్యాలమ్మ గద్దెల ప్రాంగణాలు పండగ శోభను సంతరించుకున్నాయి. గ్రామ దేవతలకు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య మొక్కులు సమర్పించుకున్న భక్తులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లారు.

## సర్‌లో భాగంగా ఓటర్లకు నోటీసులు..

**వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** సర్ ప్రక్రియలో భాగంగా మండలంలోని ఒంటిమామిడి, రాచపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఓటర్లకు వెంకటాపురం తహసిల్దార్ వేణుగోపాలరావు నోటీసులు జారీ చేశారు.

నోటీసులు అందుకున్న ఓటర్లలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 30లోకి చెందిన ఒంటి మామిడి గ్రామానికి చెందిన 130 మంది ఓటర్లు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తమ వద్ద ఉన్న పూర్తి ఆధారాలతో విచారణకు హాజరుకావాలని తహసిల్దార్ సూచించారు. అదేవిధంగా 48 పోలింగ్ బూత్ కు సంబంధించిన రాచపల్లి గ్రామానికి చెందిన 74 మంది ఓటర్లు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తమకున్న ఆధారాలతో హాజరు కావాలని తెలిపారు.

### పాలమూరు విశ్వవిద్యాలయంలో

## టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు

- ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ
- 31 ఆగస్టు 2026 నుండి 3 సెప్టెంబర్ 2026 వరకు

**పాలమూరు, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** విశ్వవిద్యాలయంలోని టీచింగ్ మరియు నాన్-టీచింగ్ ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలను 31 ఆగస్టు 2026 నుండి 3 సెప్టెంబర్ 2026 వరకు నిర్వహించడం జరుగుతుంది అని పబ్లిక్ రిలేషన్ అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్.శ్రీనివాస్ హాజరు కానున్నారు. ఈ క్రీడా పోటీలలో భాగంగా పురుషుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం 31 ఆగస్టు 2026, సోమవారం ఉదయం 9:00 గంటలకు ప్రారంభం కానున్నాయని తెలియజేశారు.

# నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు

- పరీక్షా కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్
- ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



**దేవరకద్ర, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** నీట్ పీజీ ప్రవేశ పరీక్షను జిల్లాలో ప్రశాంతమైన, సురక్షిత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన పోలీసు బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఎస్పీ తో కలిసి పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఫాతిమా విద్యాలయం మరియు JPNCE ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలు, ప్రవేశ ద్వారాల వద్ద పోలీసు సిబ్బంది విధులు, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసుల పర్యవేక్షణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, అప్రమత్తత, సమయపాలనతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మరియు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భనలో AR అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఋూ వెంకటేశ్వర్లు, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జెండా గద్దె కూల్చివేతపై రాణా ప్రతాప్ రెడ్డి ఆగ్రహం

- దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి.. గూండాగిరితో కాదు



**నల్లబెల్లి ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ జెండా గద్దె కూల్చివేతపై వరంగల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లబెల్లి మండలం ముచ్చింపుల గ్రామంలోని భారతీయ జనతా పార్టీ జెండా గద్దెను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేసిన ఘటనను గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కూల్చివేసిన బీజేపీ జెండా గద్దెను సందర్శించిన, సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి పార్టీ నాయకులు, కార్యకర్తలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ జెండా గద్దెను కూల్చివేయడం సాధారణ ఘటనగా భావించవద్దని, ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. బీజేపీ పార్టీ ఎదుగుదలను ఓర్చుకోలేక రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేని కొందరు వ్యక్తులు చీకటి మాటున ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం వారి పిరికితనానికి నిదర్శనమని మండిపడ్డారు. "దమ్ముంటే ప్రజల మధ్యకు వచ్చి రాజకీయంగా ఎదుర్కోండి..

మా కార్యకర్తల జోలికి వచ్చి, మా పార్టీ జెండాలను అవమానిస్తే మాత్రం బీజేపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు. చట్టాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం చెబుతాం" అని హెచ్చరించారు. గతంలో సైతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్లెక్సీని చింపివేసిన ఘటన చోటుచేసుకుందని, ఇప్పుడు మరో సారి బీజేపీ జెండా గద్దెను కూల్చివేయడం చూస్తుంటే ఒకే వర్గం నుంచి పదేపదే ఇలాంటి చర్యలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి దోషులను గుర్తించి, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ జెండాను కూల్చివేయగలరేమో కానీ బీజేపీ కార్యకర్తల ఆత్మవిశ్వాసాన్ని మాత్రం కూల్చలేరు. ఒక్క గద్దె కూల్చితే వంద గద్దెలు నిర్మిస్తాం... ఒక్క జెండాను చింపితే వంద జెండాలు ఎగురవేస్తాం.. బీజేపీ పోరాటం ఆగదు కార్యకర్తల అడుగు వెనక్కి తగ్గదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, గుర్రపు నరేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బచ్చు వెంకటేశ్వర్ రావు, ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షులు ధర్మారం క్రాంతి కుమార్ తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఏటూరునాగారంలో ఘనంగా ప్రారంభమైన

## టీపీటీఎఫ్ జిల్లా స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు




**ఏటూరు నాగారం, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** సెప్టెంబర్ 5న రానున్న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని "తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ ఫెడరేషన్" (టి.పి.టి.ఎఫ్) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు ఏటూర్ నాగారం మశీదల కేంద్రంలో ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమానికి ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై, క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దిద్ది తీర్చే ఉపాధ్యాయులు, తమ దైనందిన వృత్తిపరమైన ఒత్తిడులను అధిగమించడానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని తెలిపారు. ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు టీపీటీఎఫ్ సంఘం ఇలాంటి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడలు సోదరభావాన్ని, సమైక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సినీ నటుడు సంజోష్, స్థానిక ఎస్సై మహేష్, ములుగు జిల్లా "ఆత్మ" చైర్మన్ చిటమట రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య ,టి.పి.టి.ఎఫ్ సంఘ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుల్జా భవాని ఆలయాభివృద్ధికి రూ.2 లక్షలు

- హామీ నిలబెట్టుకున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం రాంనుంతల గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నతండాలో శ్రీ తుల్జా భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆలయ నూతన నిర్మాణం, అభివృద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే పవిత్ర కేంద్రాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగి ఆలయాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. తుల్జా భవాని మాత ఆశీస్సులతో చిన్నతండా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఆర్థిక సహాయం అందించిన రాఘవేందర్‌రెడ్డికి తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాలు, తండాల అభివృద్ధి కోసం ఆయన నిరంతరం సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వల్లీ పంతు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఆలయ నిర్వాహకులు పంతు నాయక్, సోమ్లా నాయక్, జగన్, వార్డు సభ్యులు వినోద్, భాస్కర్, సీనియర్ నాయకులు జీంత నాయక్, హుమ్లా నాయక్, లాలూ నాయక్, రమేష్, గ్రామ పెద్దలు, భక్తుల, తండా ప్రజలు పాల్గొన్నారు.

### సెప్టెంబరు 8, 9 తేదీలలో జరిగే

## రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయండి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, జిల్లా సహకారదర్శి గట్టి కృష్ణల పిలుపు



**నర్సంపేట ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** సెప్టెంబర్ 8 9 తేదీలలో అఖిలభారత రైతుకుల సంఘం రాష్ట్ర తొమ్మిదవ మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఈ సభలకు రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, జిల్లా సహా కార్యదర్శి గట్టి కృష్ణ పిలుపు నిచ్చారు. దేశంలో మూడోసారి అధికారులు చేపట్టిన బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కారం చేయకుండా వ్యవసాయ రంగం దివాలా తీసే విధంగా వ్యవహరిస్తున్నారని అందులో భాగంగానే రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నప్పటికీ ఆ కమిషన్ సిఫార్సులను తుంగలో తొక్కారని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి తమ బాధ్యత నుండి వైదొలుగుతున్నారని అందులో భాగంగానే నిత్యం రైతాంగానికి ఉపయోగపడే ఎరువుల పూల పురుగుమందుల ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారని అమ్మ పోతే అడివి కొనబోతే కొరివి చందంగా వ్యవసాయ రంగం పూర్తిగా దివాలా తీస్తున్నారని అన్నారు. దేశంలో గాని ప్రపంచవ్యాప్తంగా కానీ రైతులు లేనటువంటి సమాజం లేదని ఆ రైతులు పండించిన పంటలు లేకపోతే మనిషికి ఆహారం లేదు అనేక పరిశ్రమలకు ముడి సరుకులు లేకుండా పోతున్నాయి సామ్రాజ్యవాదుల నుండి భౌల జాతి కార్పొరేట్ శక్తుల నుండి వేశారంగాన్ని కాపాడుకోవాల్సి నటువంటి ఒక గురుతరమైన బాధ్యత ఈ దేశ ప్రజలపై రైతు కూలీలపై ఉన్నదని అన్నారు మంచిర్యాలలో జరిగే మహాసభలలో రైతంగ సమస్యలపై మేధావుల ప్రసంగాలు చర్చలు ఉంటాయని భవిష్యత్ కార్యక్రమం కూడా రూపొందించుకోవడం జరుగుతుం దని దేశాన్ని కాపాడుకుందాం రైతాంగాన్ని కాపాడుకుందాం అనే పిలుపుతో మా సభలు జరగబోతున్నాయని అన్నారు. నర్సంపేట అంబేద్కర్ సెంటర్లో అఖిలభారత రైతుకుల్ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్స్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ నాయకులు ఎల్లబోయిన ఐలన్న, సలుపాల రమేష్, ఆకుతోట రాజు, ఆకారపు రాజు, రాజబోయిన ఐలయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా కోశాధికారి గొర్రె ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### ములుగు జిల్లా ఉపాధ్యాయులు

## 100% రిజిస్ట్రేషన్ చేయాలి

- ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి

**ములుగు, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి, తరగతి బోధనలో నాణ్యతను మెరుగుపరచడానికి దీక్ష ప్లాట్‌ఫారమ్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలలో ములుగు జిల్లా ఉపాధ్యాయులు 100% రిజిస్ట్రేషన్ మరియు కోర్సు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సిద్ధార్థ రెడ్డి సూచించారు.

ఈ శిక్షణా కార్యక్రమాలు జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి-2020) మరియు ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఉపాధ్యాయులు తమ బోధనలో సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యం, మరియు విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

**ముఖ్య సూచనలు:**
- అన్ని ఉపాధ్యాయులు వెంటనే దీక్ష పోర్టల్‌లో రిజిస్టర్ కావాలి.
- కోర్సులు పూర్తి చేసిన తర్వాత సర్టిఫికేట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధృవీకరించి ఎంఈఓ కార్యాలయానికి పంపాలి.
- ఎం ఈ ఓ లు మరియు ప్యానెల్ టీమ్ సభ్యులు ప్రతి పాఠశాల పురోగతిని పర్యవేక్షించాలి.
- ప్రతి మండలంలో 100% పూర్తి సాధించేందుకు ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలి.
- లక్ష్యం: ములుగు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 100% రిజిస్ట్రేషన్ మరియు 100% కోర్సు పూర్తి సాధించాలి.

## చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం

- రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపిన అధ్యక్షుడు శిరుప అనిల్



**పర్వతగిరి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ వారి ఆధ్వర్యంలో వాసవి భవన్, శాంతి నగర్, రైల్వే గేట్, వరంగల్లో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి సహకారంతో "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం శనివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శిరుప అనిల్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు యాద రవికుమార్ లు పాల్గొని, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, 51మంది రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది. రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శిరుప అనిల్ మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాలని, లేదంటే వారు చనిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గార్లపాటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేందర్, కోశాధికారి గందె శ్రీనివాస్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్,

**రక్తదాతలు:-** వైనాల రమేష్, వేణు, శంకర్, గోపాల్, రమేష్, విజయ్, కుమార్, వినయ్, సంతోష్, అశోక్, సదాశివుడు, మూర్తి, నాగేశ్వరరావు, విక్రమ్, రంజిత్, రవి, శ్రీనివాస్, సతీష్, అనిల్, సునీల్, సంతోష్, నిఖిల్, శ్రావణ్, రాజేష్, గజ్జెల సుమన్, ఉప్ప రపల్లి రాజ్ కుమార్, ఊరటి రవికుమార్, అలువల పృథ్వి, రాంప్రసాద్, ఎస్.కె ముస్తఫా తదితర రక్తదాతలు పాల్గొన్నారు.

# మందుల ముసుగులో మత్తు దందా

- ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్ల విక్రయం..
- మెడికల్ షాపు సీజ్.. యజమాని అరెస్ట్

**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్లు విక్రయించిన ఆరోపణలపై కరీంనగర్‌లోని ఓ మెడికల్ షాపుపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి షాపును సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో ఆరోగ్య ఫార్మసీ మెడికల్ షాపు యజమాని కొమ్మ రామును కరీంనగర్ రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని అరెస్ట్ మెమో జారీ చేశారు. ఈ నెల 28న కరీంనగర్ రూరల్ పోలీసులు డ్రగ్స్, హాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విచారణలో జగిత్యాల జిల్లాకు చెందిన నితిన్‌కు కరీంనగర్ బ్యాంక్‌లైన్ సమీపంలోని డీమార్ట్ వద్ద ఉన్న ఆరోగ్య ఫార్మసీ యజమాని కొమ్మ రాముతో పరిచయం ఉన్నట్లు వెల్లడైంది. ఈ పరిచయంతో



నితిన్ ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే టపాల్-50 తదితర మత్తు టాబ్లెట్లను అధిక ధరలకు కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అనంతరం నితిన్‌తో పాటు మరో ఎనిమిది మంది ఆ టాబ్లెట్లను నీటిలో కరిగించి సిరింజీల ద్వారా శరీరం లోకి ఎక్కించుకుని మత్తుకు అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిం చాలని కోరుతూ కరీంనగర్ రూరల్ పోలీసులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ ఈ నెల 29న ఆరోగ్య ఫార్మసీని తనిఖీ చేశారు. తనిఖీల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించడం, విక్రయాలకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయకపోవడం వంటి అంశాలను గుర్తించి నట్లు పోలీసులు తెలిపారు. నిబంధనల ప్రకారం మెడికల్ షాపును సీజ్ చేశారు.

ఈ క్రమంలో షాపు యజమాని కొమ్మ రామును ఆదివారం ఉదయం కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని పంచుల సమక్షంలో విచారించారు. అధిక డబ్బు




సంపాదించాలనే ఉద్దేశంతో ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయకుండా నితిన్‌కు గత కొంత కాలంగా మత్తు టాబ్లెట్లు విక్రయించినట్లు ఆయన అంగీకరించి నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం పంచనామా నిర్వహించి అరెస్ట్ మెమో జారీ చేశారు.

ఇప్పటికే కేసులో స్వాధీనం చేసుకున్న టాబ్లెట్లు, సిరింజీలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించి పూర్తి నివేదిక కోరినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నివేదిక అందిన అనంతరం వెల్లడయ్యే అంశాల ఆధారంగా కొమ్మ రాముపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుని చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# కీలక వ్యాఖ్యలు చేసిన మహేష్ కుమార్

- తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత పరిణామాలపై కామెంట్స్..
- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు..



**హైదరాబాద్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

### ప్రజావాణికి అధికారులు

## సకాలంలో హాజరు కావాలి : కలెక్టర్



**కొత్తగూడెం ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్య క్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించాలని సూచిం చారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో, జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాల యాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు. కావునా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## హెచ్చరిక బోర్డునే పీకేశారు!

- ప్రభుత్వ భూమిలో కబ్జాదారుల దూకుడు..

క్రిమినల్ కేసులు పెట్టాలని 'జనం కోసం' డిమాండ్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** హఫీజ్‌పేట్ దీప్తిశ్రీనగర్‌లోని సర్వే నంబర్ 151లో ప్రభుత్వ భూమి, రేగులకుంట సర్కారీ శిఖం పరిరక్షణకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కబ్జాదారులు పీకిపారేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై చర్యల్లో భాగంగా శేరిలింగంపల్లి తహసీల్దార్ శనివారం అక్కడ స్వాధీనం, హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును కబ్జాదారులు బేఖాతరు చేసి తొలగించారని 'జనం కోసం' ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించడం చట్టాన్ని ధిక్కరించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను, రెవెన్యూ అధికారుల చర్యలను అడ్డుకునే విధంగా వ్యవహరించిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని 'జనం కోసం' డిమాండ్ చేసింది.

సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ భూమి, రేగులకుంట సర్కారీ శిఖాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరింది. హెచ్చరిక బోర్డును తొలగించిన ఘటనపై కూడా అధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి

- రూ.700 కోట్ల నిధులతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి



**గద్వాల, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎంతో విశిష్టత కలిగిన అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రసాద్ పథకంలో భాగంగా అలంపూర్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, భవిష్యత్తులో కూడా క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆది వారం రాత్రి అలంపూర్ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన మల్టీమీడియా సౌండ్ అండ్ లైట్ షోను మంత్రి ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..** అలంపూర్ క్షేత్రాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 25 నిమిషాల పాటు ఆలయ చరిత్ర, విశిష్టతను తెలియ జేసే విధంగా సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తాను గతంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలోని సుమారు 15 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.700 కోట్ల నిధులు కేటాయించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో



కృషి చేసిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు దర్శనీయ, ఆధ్యాత్మిక ప్రదేశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని చెప్పారు. గోల్కొండ కోట, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద సౌండ్ అండ్ లైట్ షోలను ఏర్పాటు చేసినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. జోగులాంబ రైల్వే స్టేషన్‌ను అమృత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేశామని, అలంపూర్ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు స్థానికులు తమ సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**భక్తులకు మెరుగైన సౌకర్యాలు..**

**మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ..** అలంపూర్ ఆలయాలను సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రసాద్ పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అన్నదాన భవనం, విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టు, కల్చరల్ థియేటర్ తదితర సౌకర్యాలతో పాటు తుంగభద్ర నదిలో బోటింగ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



అమృత్ పథకంలో భాగంగా జోగులాంబ రైల్వే స్టేషన్‌తో పాటు గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని డీకే అరుణ తెలిపారు.

**టెంపుల్ టూరిజానికి ఊతం..**

**నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ..** అలంపూర్ ఆలయాల విశిష్టతను తెలియజేసేలా మల్టీమీడియా సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయడం ద్వారా టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని తెలిపారు. డోర్నకల్ నుంచి గద్వాలకు రైల్వే లైన్ ఏర్పాటు కోసం కూడా కృషి చేస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గౌతమి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, టూరిజం రీజినల్ డైరెక్టర్ వెంకటేష్, ఈడీ ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారి రామలింగేశ్వర గౌడ్, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ జయరాముడు, కమిషనర్ రాజేష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గద్వాల మార్కెట్ యార్డులో భారీగా గంజాయి పట్టివేత..!

- 6 కేజీల గంజాయి స్వాధీనం.. విలువ రూ.6 లక్షలు
- ఇద్దరు అదుపులో.. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం
- గంజాయి సరఫరాపై అనుమానాలు
- పోలీసుల నిఘా పెంచాలని ప్రజల డిమాండ్

**గద్వాల, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడి నట్లు సమాచారం. సుమారు 6 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీని బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుండగా.. మరో వ్యక్తి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న ఇద్దరు ఇటిక్యాల మండలం శెనిగపల్లి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు



సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భారీ మొత్తంలో గంజాయి పట్టుబడటంతో గద్వాల పట్టణంలో గంజాయి విక్రయాలు, సరఫరాపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల అక్రమ వ్యాపారం జరుగుతోందా అనే



ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్కెట్ యార్డు పరిసరాలతో పాటు పట్టణంలోని అనుమానాస్పద ప్రాంతాలు, ప్రధాన స్థావరాలపై పోలీసులు మరింత నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. గంజాయి రహిత గద్వాల కోసం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి, సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు, ప్రధాన నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

- 1471 మంది అభ్యర్థుల హాజరు.. 34 మంది గైర్హాజరు



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో నీట్ పీజీ-2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1505 మంది అభ్యర్థులకు గాను 1471 మంది పరీక్షకు హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదివారం సంయుక్తంగా పర్యవేక్షించారు. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను వారు సందర్శించి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియ, భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను అధికారులు సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.. నీట్ పీజీ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని తెలిపారు. పరీక్ష సజావుగా జరిగేలా ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. పరీక్ష పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 5 వేల ప్రత్యేక బస్సులు ఉత్త మాటేనా?

- వికారాబాద్‌లో ప్రయాణికులకు నరకయాతన
- రాఖీ పౌర్ణమి వేళ బస్టాండ్‌లో గంటల తరబడి పడిగాపులు
- బస్టాండ్‌లో ఉన్న అధికారుల నిర్లక్ష్య సమాధానాలు.. ప్రజల ఆగ్రహం



**వికారాబాద్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :** రక్షాబంధన్ రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించినప్పటికీ.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపించింది. పండుగ సందర్భంగా స్వగ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు వేలాది మంది ప్రయాణికులు వికారాబాద్ బస్టాండ్‌కు చేరుకోగా అందుకు అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా తాండూర్, సదాశివపేట, హైదరాబాద్, శంకర్‌పల్లి, సంగారెడ్డి, పరిగి, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, కొడంగల్‌తో పాటు కర్ణాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్ కిక్కిరిసిపోయింది. రద్దీని ముందుగానే అంచనా వేసి అదనపు బస్సులను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. బస్టాండ్‌కు రావాల్సిన బస్సులు సైతం ఆలస్యంగా రావడంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు గంటల తరబడి నిల్చొని తీవ్ర అవస్థలు పడ్డారు. ఒక బస్సు వస్తుందన్న సమాచారం అందగానే ప్రయాణికులు ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగే ప్రమాదకర పరిస్థితులు కూడా కనిపించాయి. ఏ రూటుకు బస్సు ఎప్పుడు వస్తుంది. అదనపు బస్సులు ఎన్ని నడుస్తున్నాయి అనే కనీస సమాచారాన్ని కూడా ప్రయాణికులకు అందించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు మండిపడ్డారు. బస్సు ఎప్పుడు వస్తుందని సిబ్బందిని అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ రద్దీకి తగ్గట్టుగా ముందస్తు ప్రణాళిక రూపొందించి బస్సులను అందుబాటులో ఉంచాల్సిన ఆర్టీసీ అధికారులు కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని మంత్రి ప్రకటిస్తే మరోవైపు వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి రావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని పలువురు విమర్శించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల పట్ల ఆర్టీసీ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు మరింత అమర్యాదగా మారిందని కొందరు ప్రయాణికులు ఆరోపించారు. మంత్రి ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయా అంటూ మండిపడ్డారు రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ప్రత్యేక బస్సులు ఎక్కడ తిరుగుతున్నాయి వికారాబాద్ ప్రయాణికులకు ఆ బస్సులు ఎందుకు అందుబాటులోకి రాలేదు అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పండుగ రోజుల్లో వేలాది మంది ప్రయాణికులు ఆధారపడే వికారాబాద్ బస్టాండ్‌లో ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఇకనైనా పండుగలు, సెలవులు, శుభకార్యాల సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి రూట్‌లో బస్సుల సమయాలపై స్పష్టమైన సమాచారాన్ని ప్రకటించి, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించేలా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా?

## రాయలసీమ ప్రాంతానికి నీటి విడుదల ఎప్పుడు..మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



**నంద్యాల, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దాటి మూడవ సంవత్సరంలో పాలన మరింత దారుణంగా మారిందని, మొదటి సంవత్సరంలో పంటనష్టం, రెండవ సంవత్సరం గిట్టుబాటు ధరలు లేవని, ఈ సంవత్సరం పంటలు సాగుచేయలేని దుర్భిక్షపరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా? రాయలసీమ ప్రాంతానికి ఎప్పుడు నీటి విడుదల చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ లో 873 అడుగుల నీటి నిల్వలు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, త్రాగునీరు వదలాలని ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల మండలం కానాల చెరువును మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూకానాల చెరువులో చుక్కనీరు లేక ఎండిపోయిన పరిస్థితి ఉన్నదని, గత రెండు సంవత్సరాలుగా రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్న తరుణంలో ఈ ఏడాది అయినా ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన రైతన్నల ఆశలు అడిఆశలుగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులే రైతులను పంటలు సాగు చేయవద్దని చెప్పడం జరిగిందని, పంటలు సాగు చేయని పక్షంలో ప్రత్యామ్నాయ వనరులను కల్పించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90శాతం పూర్తి చేస్తే కేవలం 10శాతం మాత్రం పూర్తి చేయాల్సి ఉండగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను నిలిపివేయడం ఒక దొంగచాటు వ్యవహారమని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీరు లేక రైతులు పంటలు పండించని పరిస్థితి, ఇక గ్రామాల్లో త్రాగునీరు లేక పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ దారుణమైన పరిస్థితిని గమనించి ప్రభుత్వం దిగువకు నీటిని వదిలి రాయలసీమ ప్రాంత వాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం పంటల ఇన్స్యూరెన్స్ లేదని, అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదని విమర్శించారు. కానాల చెరువులో మట్టి త్రవ్విన గుంతలు కనిపిస్తున్నాయని, ఈ చెరువులో మట్టిని ఏప్రాజెక్ట్ కు అవసరం అయి చేశారు? ఈ మట్టి వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత? మైనింగ్ వారికి ఎంత ముట్టింది? ఇరిగేషన్ వారికి ఎంత అందింది? చెప్పాలని, ఈ విషయంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం అంతా అధికారుల నిర్లక్షానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రంగారావు,పిడి ఉసేన్,శంకర్, రంగారావు, కాసిం,మరియధాస్,కరీం,పక్రుదిన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగవుశేని, మధు గౌడ్, పకీర్ సా, గ్రామ రైతులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో నీట్-పీజీ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్..





**పెద్దపల్లి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

పెద్దపల్లి పట్టణంలో ఆదివారం నిర్వహించిన నీట్–పీజీ 2026 పరీక్షల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీతో కలిసి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు,

భద్రతా ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, భద్రతా ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే,పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు,ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా తరలించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి జోన్ పరిధిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో నీట్–పీజీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలోని బందారికుంట సమీపంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నిర్వహణతో పాటు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు,ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని,అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే





**రాయికల్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయికల్ మండలంలోని అల్లిపూర్, తాట్లవాయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లిపూర్‌లో ఒరుగంటి రాజమ్మగంగారాం కుటుంబ సభ్యుల నూతన గృహ ప్రవేశంలో పాల్గొని రాజమ్మకు చీరను కానుకగా అందజేశారు.అనంతరం తాట్లవాయి గ్రామంలో చీటి మంగరవీందర్ రావు, చిట్యాల కీర్తనగంగాధర్ కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని అభినందనలు తెలిపారు. ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. గోదావరిఖని పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినిమా సహనిర్మాతలు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం దొడ్డి కొమరయ్య సినిమా ప్రచారంలో భాగంగా ర్యాలీగా హెచ్ఎంఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి సినిమా నిర్మాణంలో సహనిర్మాతలుగా భాగస్వాములైన 31 మందిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు, సహనిర్మాత రాదండి బాలయ్య మాట్లాడుతూ తెలంగాణ వీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ వీరుల త్యాగాలు, పోరాట చరిత్రలు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.

సినిమా దర్శకుడు ఎం. సేనాపతి మాట్లాడుతూ 243 కులాలకు చెందిన వారి భాగస్వామ్యంతో దొడ్డి కొమరయ్య సినిమాను నిర్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రామగుండం నియోజకవర్గ దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంటి శంకరయ్య పటేల్, గౌరవ సలహాదారులు, సహనిర్మాతలు కాసర్ల రాజిరెడ్డి, తోడేటి శంకర్ గౌడ్, గోగుల రాజిరెడ్డి, ఆరెల్లి మల్లేష్, నిర్మాణ కమిటీ చైర్మన్, సహనిర్మాత సాయిరి సాంబయ్య, కో–చైర్మన్లు, సహనిర్మాతలు చిన్నాల మల్లయ్య యాదవ్, దేవా భారతి తదితరులు పాల్గొన్నారు.

అలాగే రామగుండం నియోజకవర్గ సహనిర్మాతలు సూర లక్ష్మి, బోదాసు రజిత, ఠాకూర్ లలితా దేవి, బోయరా పంచపూల, గొట్టేపర్తి వెంకటమ్మ, డాక్టర్ లెక్కల నగేష్, కుక్క చంద్రమౌళి, కొమ్మ కుమార్ యాదవ్, కల్లేపల్లి నర్సింగం, ఉదరి స్వామి గౌడ్, గంటి సాయి పటేల్ తేజ్, పెద్దపల్లి జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్, సహనిర్మాత బత్తుల శంకర్, కరీంనగర్ జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా సహనిర్మాత శ్రీమతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ లో భారీగా CMRF చెక్కుల పంపిణీ లబ్ధిదారుల్లో ఆనందం

## బీజేఎల్పి నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో...



**సోన్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

సోన్ మండలానికి చెందిన గ్రామాలకు. లబ్ధిదారులకు (CMRF)ద్వారా మంజూరైన చెక్కులను బిజెపి నేత ఆదివారం పంపిణీ చేశారు, అధ్యక్షులు మాట్లాడుతూ,బిజెపి మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్ రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు,పాకపాట్ల 6, మాదాపూర్ 3,కడ్తాల్ 2, సోన్ 2 వెల్మల్ 2 కూచన్ పల్లి 1, సాకేర 1, గంజాల్ 2, పోచంపాడ్ 1మొత్తం 19 సిఎంఆర్ అందజేశారు,

వివిధ మండలాలకు చెందిన 226 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను బీజేపీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు.

బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మొత్తం రూ.56,43,000 విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు CMRF ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

లబ్ధిదారులు తమ దరఖాస్తులను నేరుగా ఎమ్మెల్యే కార్యాలయంలో అందించడం ద్వారా ఈ సహాయం పొందారని, ఇంకా ఎవరైనా అవసరంలో ఉన్నవారు సంప్రదించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సవీణ్, సర్పంచ్ రాజారెడ్డి, మాదాపూర్ సర్పంచ్ మల్లేష్, బీజేవైఎం నాయకులు శీను, సాగర్, ఉదయ్, శీను పార్టీ నాయకులు పాల్గొన్నారు

# పాంచజన్యంతోనే సామాజిక న్యాయం: వాసిలి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధికారంలోకి రాగానే 'పాంచజన్యం' ఎజెండాతో సామాజిక న్యాయ తెలంగాణను సాకారం చేస్తుందని పార్టీ శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు చేపట్టిన జెండా పండుగలో భాగంగా ఆదివారం మక్తా మహబూబ్‌పేట్ డివిజన్ చౌరస్తాలో ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. డివిజన్ అధ్యక్షుడు గుండె దయానంద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో వాసిలి మాట్లాడుతూ 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించి కవిత తెలంగాణకు తొలి మహిళా ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, షేక్ అస్లాం, సందీప్, కుమార్ కూర్మ, విష్ణుచారి, మురుగేశన్, ప్రభు, ప్రభు ముదిరాజ్, లక్ష్మి, మాధవి, ప్రవీణ్, రఘు, మనోజ్, షేక్ వలి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె



**చంద్రుగొండ, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

చంద్రుగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు.అనంతరం అయ్యన్నపాలెంలోని ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన బూరుగు వారి వివాహ వేడుకకు నూతన దంపతులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా"వాఫెల్ క్యాసిల్"ను ప్రారంభించిన -ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ గాజులరామారం 125 డివిజన్ ద్వారకా నగర్ కమాన్ వద్ద సుమంత్ రెడ్డి భాను ప్రకాష్ ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "వాఫెల్ క్యాసిల్" ను బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాన్వేషణ వైపు కాకుండా వ్యాపారం వైపు దృష్టిసారించడం చక్కటి పరిణామమన్నారు.ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి,సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్,అంజన్ గౌడ్,అడ్వకేట్ కమలాకర్,తెలంగాణ సాయి,స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేసిన - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (జర్నలిస్ట్ ఫైల్) :**

కుత్బుల్లాపూర్ ఐడిపిఎల్ చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ కులస్తులకే పరిమితమైన నాయకుడు కాదని సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు.ఆయన ఆశయాలు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.అనంతరం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు స్థానిక కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్దార్ పాపన్న గౌడ్ కమిటీ చైర్మన్ నందనం దివాకర్,అధ్యక్షులు గంగా శ్రీనివాస్ గౌడ్,మాజీ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్,ఆనంద్ గౌడ్,ప్రభా గౌడ్,జయ శ్రీ,టీ నర్సింగరావు గౌడ్,బుర్ర మణికంఠ గౌడ్,శ్యామనారాయణ గౌడ్,ప్రభు,సంతోష్,సురేష్ గౌడ్,భూషణం గౌడ్,సంజు గౌడ్,రాజు గౌడ్,లక్ష్మణ్ గౌడ్,అనిల్,శివ గౌడ కుల పెద్దలు,స్థానిక నాయకులు,పలువురు ప్రముఖులు,కమిటీ సభ్యులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి




○ **అధికారులకు గుంటూరు నగర కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) ద్వారా అందే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. పరిష్కరించిన సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించారు.


రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అదే స్థాయిలో అధికారులు స్పందించి ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, పిజిఆర్ఎస్‌తో పాటు ఇతర వేదికల ద్వారా అందిన అర్జీల పరిష్కార పురోగతిపై విభాగాధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య పరిష్కారానికి సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని అర్జీదారునికి స్పష్టంగా వివరించి ఎండార్స్మెంట్ ఇవ్వాలని సూచించారు.

నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పిజిఆర్ఎస్ ద్వారా మొత్తం 49 అర్జీలు అందగా, పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 21, రెవెన్యూ విభాగానికి 9, ప్రజారోగ్య విభాగానికి 5, యూపీఏ సెల్‌కు 2, అకౌంట్స్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డీసీపీ సూరజ్ కుమార్, ఏఓ తిరుపతి నాయుడు, మేనేజర్ బాలాజీ బాషా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## రాజంపేట ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్టుకు ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయాలి




**రాజంపేట (జర్నలిస్ట్ ఫైల్) :** రాజంపేట పట్టణంలోని ఇండోర్ స్టేడియం షటిల్ కోర్టులో నాణ్యమైన ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయాలని కోరుతూ రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్వో మల్లికార్జున్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్ మాట్లాడుతూ రాజంపేట ఇండోర్ స్టేడియానికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత క్రీడల కోసం వస్తున్నారని తెలిపారు. అయితే షటిల్ కోర్టులో సరైన ఫ్లోర్ మ్యాట్ లేకపోవడంతో ఆటలు ఆడే సమయంలో క్రీడాకారులకు కాళ్ల నొప్పులు రావడంతో పాటు గాయాలయ్యే ప్రమాదం ఉందన్నారు.

విద్యార్థులు, యువతలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని ప్రశాంత్ పేర్కొన్నారు.

క్రీడా మైదానాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

కడప జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రాజంపేట ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టుకు నాణ్యమైన ఫ్లోర్ మ్యాట్ ఏర్పాటు చేయడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన ఇతర సౌకర్యాలను కూడా మెరుగుపరచాలని ఆర్ఎస్‌యూ తరఫున ప్రశాంత్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, యువత క్రీడల్లో మరింతగా రాణించేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** మండలలోని మల్లెపల్లె బి.మఠం 33/11 కెవి. సబ్ స్టేషన్ల నందు ప్రధానమంత్రి కుసుం యోజన సోలార్ కు సంబంధించి మీటరింగ్ పనులు సబ్ స్టేషన్ మరమత్తుల కారణం చేత నేడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీపతి బద్వేల్ విద్యుత్ ఏ.డి.ఈ.కుళాయప్ప, బి.మఠం విద్యుత్ ఏ.ఈ. రవిశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయదారు లతోపాటు పలు రకాల విద్యుత్ వినియోగదారులు సరఫరాలో ఏర్పడ్డ అంతరాయాన్ని గుర్తించి సహకరించగలరని బద్వేల్ మైదుకూరు విద్యుత్ ఈ.ఈ. లక్ష్మీపతి ఏడీఈ. కుళాయప్ప బి మఠం ఏ.ఈ. ఈ.రవిశంకర్ లు తెలియజేశారు.

## విమెన్స్ కాలేజీలో రూ.1.98 కోట్లతో అదనపు తరగతి గదులు

○ **జీం2 భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ విమెన్‌లో విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 1.98 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల భవనానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణంలో 12 అదనపు తరగతి గదులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 1942లో స్థాపించబడిన ఈ కళాశాలకు ఘనమైన చరిత్ర ఉందని, ప్రస్తుతం 2,500 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విద్యార్థినుల సంఖ్య పెరగడంతో ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడం లేదని, అదనంగా 12 తరగతి గదులు అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నాకుమారి తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కోల్ ఇండియా నుంచి సీఎస్ఆర్ నిధులను సమీకరించినట్లు మంత్రి వెల్లడించారు. సుమారు 9,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీం2 అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి భవనాన్ని విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు సీఎస్ఆర్ నిధులను సమన్వయం చేసుకుంటూ గుంటూరు ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పెమ్మసాని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రిన్సిపాల్, స్థానిక ఎమ్మెల్యే, కోల్ ఇండియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్, డేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

○ **మంగళగిరిలో పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ సోమవారం మంగళగిరిలో పరిశీలించారు. 6వ బెటాలియన్ ఏపీఎస్పీ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించిన ఎస్పీ, ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి సమీక్షించారు.

రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6వ బెటాలియన్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర డీజీపీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, యూనిట్లకు చెందిన పోలీస్ క్రీడాకారులు, అధికారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలపై ఎస్పీ అధికారులతో చర్చించారు.

స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వివిధ క్రీడా పోటీలను పలు ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. అమరావతి విట్ కళాశాలలో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, మంగళగిరిలో స్విమ్మింగ్, కృష్ణా నదిలో వాటర్ స్పోర్ట్స్, తాడేపల్లి నులకపేటలోని ఫైరింగ్ రేంజ్‌లో షూటింగ్, ఫైరింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపు, వివిధ విభాగాల మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసు, ఆర్ఐ వెల్ఫేర్ సురేష్ బాబు, 6వ బెటాలియన్ ఏపీఎస్పీ అధికారులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు.

## ఎల్‌నినో ప్రభావంతో పంటల పరిస్థితిపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలో పంటల పరిస్థితిని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్, ఐఏఎస్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని పత్తి పొలాలను సందర్శించి పంట ఎదుగుదల, పురుగుల ఉధృతి తదితర అంశాలను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి పంట ఎదుగుదల మందగించడంతో పాటు రసం పీల్చే పురుగుల ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. రైతులతో మాట్లాడి పంటల సాగులో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు తమ పంటలను నమోదు చేసుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా డైరెక్టర్ తెలుసుకున్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు ద్వారా ప్రభుత్వ పథకాలు, పంట బీమా తదితర ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు.

పంటల పరిస్థితిపై సమగ్రంగా అంచనా వేసి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలకు డైరెక్టర్ సూచించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు అవసరమైన చర్యలు, పంట నిర్వహణపై రైతులకు తగిన సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, ఏడీఏ కే. లక్ష్మి, మేడికొండూరు మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆర్ఏఆర్ఎస్ లామ్ ఫార్మ్ శాస్త్రవేత్తలు రాజేష్ చౌదరి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రైతుల పంట పరిస్థితిని వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ, పంటల సమస్యల పరిష్కారానికి అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

## భూముల క్షేత్రస్థాయి సర్వేలో లోపాలను ఉపేక్షించేది లేదు

○ **జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**

○ **ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవు**

○ **సర్వే పూర్తికాగానే విధిగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి**

○ **అధికారులు, సర్వేయర్లతో సమీక్షా సమావేశంలో స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్**



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** భూముల క్షేత్రస్థాయి సర్వే నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు, లోపాలు తలెత్తకుండా పక్కాగా వ్యవహరించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు ఆర్డీవోలు, మండల తహసిల్దార్లు, సర్వేయర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వే నిమిత్తం కేవలం అధికారిక చలానా మాత్రమే చెల్లించాలని, ఎవరికీ ఎలాంటి అదనపు రుసుములు లేదా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలను అనవసరంగా ఇబ్బంది పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని తీవ్రంగా హెచ్చరించారు.

ప్రజా అభిప్రాయ సేకరణలో అందిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆరా తీశారు. సర్వే ముగిసిన తర్వాత సంబంధిత వ్యక్తులకు విధిగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, కేవలం "సర్వే ముగిసింది" అని నోటిమాటగా చెప్పడం సరికాదన్నారు. సర్వేలపై నిర్లక్ష్యంగా వ్యవహరించి అత్యధిక ఫిర్యాదులు ఎదుర్కొంటున్న వేమూరు మండలం పెరవల్లి సర్వేయర్ ఎం. శిరీష, బాపట్ల మండలం మూలపాలెం సర్వేయర్ ఎన్. బాలాజీ, అనంతవరం సర్వేయర్ అన్వర్ బాషా మరియు రేపల్లె సర్వేయర్లకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సదరు ఫిర్యాదుదారులను స్వయంగా విచారించాలని అధికారులను ఆదేశించారు. దసర్వేయర్లు తమ పనితీరును మెరుగుపరుచుకుంటేనే ప్రభుత్వానికి, అధికారులకు ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుందని కలెక్టర్ హితవు పలికారు.

ఈ సమావేశంలో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శేషగిరిరావు, అల్తాఫ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు హరికుమార్, నరసింహారావు, శ్రీదేవి సంబంధిత తహసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



○ **జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం నాణ్యతతో కూడినదై ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల సత్వర పరిష్కారం కోసం అర్జీలను అందజేస్తుంటారని వారి అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, పరిష్కారం సాధ్యంకాని అంశాలపై స్పష్టమైన కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ ఎన్ ఎస్ కె ఖాజావలి, డ్వామా పిడి శంకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, డి పి ఓ సాయి కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సత్యనారాయణ, డిటిసి సీతారామి రెడ్డి , జిల్లా ఉపాధి కల్పనా అధికారి అభినవ్ ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

○ **బాపట్ల జిల్లా ఎస్పి బి ఉమా మహేశ్వర్ ఐపీఎస్**



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' – అర్జీలు స్వీకరించిన ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు . ఈ కార్యక్రమంలో 54 మంది అర్జీదారుల నుండి వినతుల స్వీకరించ్చినట్లు తెలిపారు. బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ స్వయంగా అర్జీదారుల నుండి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు తమ వినతులను అందజేశారు. అత్తారింటి వేధింపులు,ఆర్థిక పరమైన మోసాలు, స్థల వివాదాలు తదితర సమస్యలపై మొత్తం 54 మంది అర్జీదారులు తమ విన్నపాలను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో నిష్పక్షపాతంగా విచారించి, త్వరితగతిన నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అంతేకాకుండా, అర్జీదారుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై పూర్తి నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ విభాగానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఐ లక్ష్మి రాజ్యం తదితర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజల అవసరాల కోసం రంగయ్య సత్రం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** పేద ప్రజల అవసరాలు తీర్చుకునేందుకు కంబాల రంగయ్య సత్రాన్ని పునః నిర్మాణం చేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ ఎమ్మెల్సీ, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. రూ 56 లక్షలతో పునఃనిర్మాణం చేసిన కంబాల రంగయ్య సత్రాన్ని ఆయన స్థానికులతో కలిసి సోమవారం ప్రారంభించారు. నాలుగు వసతి గదులు, భోజనాలు ఏర్పాటు చేసుకునేందుకు హాలు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ పేద ప్రజల అవసరాలు తీర్చేందుకు 1937లో కంబాల రంగయ్య ఆయనకు చెందిన యావదాస్తిని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అందజేశారన్నారు. బీమా వారి పాలెం కేంద్రంగా కంబాల రంగయ్య సత్రాన్ని నిర్మించారని కాలక్రమేనా శిథిలా వ్యవస్థకు చేరిందన్నారు. స్థానికుల కోరిక మేరకు తన వ్యక్తిగత నిధులు 56 లక్షల తొ కంబాల రంగయ్య సత్రన్ని నిర్మించామని, అద్దెనివాసాలలో నివసించే ప్రజలు ఈ సత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సత్రంలో నిద్ర చేసుకోవడం, భోజనాలు ఏర్పాటు చేసుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. కమిటీ సభ్యులు నిత్యం అందుబాటులో ఉంటూ అవసరమైన వారికి అందిస్తారని, పేదలకు అత్యవసర సమయంలో ఉపయోగపడే సత్రం పునః నిర్మాణం చేసే అవకాశం తనకు రావడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ తాము కోరిన వెంటనే సత్రంను అన్నం సతీష్ నిర్మించారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లేళ్ల నాగేశ్వరరావు, లేళ్ల వెంకటస్వామి,లేళ్ళ సత్యనారాయణ,ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి,లేళ్ళ నరేంద్ర,రౌతు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల ఓటరు జాబితాపై గ్రామ సభలు నిర్వహించాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామ పంచాయతీల ఓటరు జాబితాపై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల తుది ప్రచురణ సోమవారం (ఆగస్టు 31) చేయడం జరిగిందన్నారు. ఎస్.సి, ఎస్.టి ఓటర్లకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 2వ తేదీ నాటికి విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు పట్ల ఈ నెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యాలు ఉండరాదని అన్నారు. అసౌకర్యాలు ఉంటే అందుకు ఎం.పి.డి.ఓలు బాధ్యత వహిస్తారని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల పట్ల ప్రజల సంతృప్తి పెరగాలని, ఇందుకు సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది శ్రద్ధ వహించాలని అన్నారు. శాఖల వారీగా సేవలు, లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దాలని స్పష్టం చేశారు. ఉన్న వసతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ – ఇకెవైసి పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ భూపరిమితి చట్టం కింద ఉన్న కేసులను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. యానాది కులం చిన్నారులకు ఆధార్ త్వరితగతిన జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీన్ గుంటూరులో నాటిన ప్రతి మొక్క బ్రతకాలని స్పష్టం చేశారు. నియోజక వర్గాల, మండల ప్రత్యేక అధికారులకు వారు తనిఖీ చేయాల్సిన అంశాలపై యాప్ ను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుతున్న అర్జీలు పక్కాగా, సంతృప్తికరంగా పరిష్కారం కావడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ లో భాగంగా దాదాపు 75 శాతం వరకు విచారణ పూర్తి అయిందన్నారు. మంగళగిరి, తాడికొండలలో ఇంకా వేగవంతం కావాలని స్పష్టం చేశారు. క్లెయిమ్ లను బూత్ స్థాయి అధికారుల వారీగా విచారణ చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే చేయడమే కాకుండా డేటా పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి ఆర్.రామలింగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## అప్పసాని రాజేష్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు మంత్రి లోకేష్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ కుమారుడు నాగ సత్యేంద్ర, స్రవంతిల వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మంత్రి లోకేష్ రిసెప్షన్‌కు హాజరుకావడంతో అప్పసాని రాజేష్ కుటుంబ సభ్యులు, బంధువులు, టీడీపీ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వివాహ రిసెప్షన్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధువులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

## నేటి నుంచి ఏపీ జేఏసీ అమరావతి నిరసనలు



- ఉద్యమ కార్యాచరణపై కలెక్టర్లకు ఏపీ జేఏసీ అమరావతి నోటీసులు
- సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన
- 15 నుంచి వర్క్ టు రూల్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ అమరావతి తొలి దశ ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం ఉద్యమ కార్యాచరణ నోటీసులను అందజేశారు. జిల్లా చైర్మన్లు, చైర్‌పర్సన్లు, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో కలెక్టర్లను కలిసి నోటీసులతో పాటు ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్‌ను అందజేశారు.

సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేయనున్నారు. అలాగే సెప్టెంబర్ 1 నుంచి తమ సెల్‌ఫోన్ వాట్సాప్ డీపీగా లిలి"సీఎం సార్.. మా డబ్బులు మాకు ఇవ్వండి"లిలి అనే నినాదాన్ని పెట్టుకుని ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఏపీ జేఏసీ అమరావతి పిలుపునిచ్చింది.

ఉద్యమ కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 3, 5 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించడంతో పాటు, న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కరించాలని కోరారు.

సెప్టెంబర్ 15 నుంచి లిలి'వర్క్ టు రూల్'లిలి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తెలిపారు. ఉద్యమ కార్యాచరణపై కలెక్టర్లకు స్పష్టంగా వివరించామని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ప్రకటించిన కార్యాచరణ ప్రకారం తదుపరి దశల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నో మేళ్లు చేసింది

- నోబుల్ టీచర్స్ అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ సంఘాల నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు సూచించారు. ఇటీవల జరిగిన జేఏసీ సమావేశంలో బొప్పరాజు చేసిన వ్యాఖ్యలపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలకు సంబంధించిన వీడియోలను ప్రస్తావించిన నాయకులు, గత రెండేళ్లలో ప్రభుత్వం ఉద్యోగులకు చేసిన మేలును కూడా అదే స్థాయిలో ప్రస్తావించి ఉంటే బాగుండేదని వారు అన్నారు. దాదాపు రూ. 22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, పెన్షనర్లకు బకాయిల చెల్లింపు, సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్‌ను ఖాతాల్లో జమ చేయడం వంటి అంశాలను కూడా ఉద్యోగుల ముందు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను క్లియర్ చేసి, ప్రస్తుతం 15 రోజుల్లోనే మంజూరు చేసే పరిస్థితి కల్పించిందని తెలిపారు. ఏపీజీఎల్ఐ బకాయిల చెల్లింపు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కమ్యుటేషన్ మొత్తాలను త్వరితగతిన చెల్లిస్తున్న విషయాలను కూడా ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం పలుమార్లు ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలపై అప్పటి నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని ఎన్‌టీఏ నాయకులు నిలదీశారు. రివర్స్ పీఆర్సీ, డీఏల రద్దు, హెచ్‌ఆర్ఏ స్లాబ్‌ల తగ్గింపు, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం లేకుండా చేయడం, వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయిన సమయంలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలపై గతంలోనూ ఇదే స్థాయిలో పోరాడి ఉంటే ఉద్యోగులకు మరింత ప్రయోజనం చేకూరేదని అన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై చర్చలకు పిలుస్తూ, బకాయిల చెల్లింపులు చేపడుతూ, ఐఆర్ ఇస్తామని, పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్న సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం సమంజసం కాదని ఎన్‌టీఏ నాయకులు పేర్కొన్నారు. నిజమైన ఉద్యోగ సంఘాల నాయకులైతే ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చేసిన మేలును కూడా గుర్తించి చెప్పాలని కోరారు. ఉద్యోగుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా సంఘాలు పనిచేయాలని కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు స్పష్టం చేశారు.

## ఎన్ఆర్ఐఐటీలో ఘనంగా ఇంజినీరింగ్ తరగతుల ప్రారంభం

- 'ప్రారంభ్-2026'తో నూతన విద్యార్థులకు కెరీర్‌పై దిశానిర్దేశం




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల తరగతుల ప్రారంభాన్ని పురస్కరించుకుని 'ప్రారంభ్--2026' దీక్షా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని ఎఫ్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన విద్యార్థులకు విద్య, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అవకాశాలపై నిపుణులు దిశానిర్దేశం చేశారు.

కార్యక్రమానికి ఇన్ఫోసిస్ సంస్థ సేవల విభాగం డైరెక్టర్, విశాఖపట్నం కేంద్రం అధిపతి నర్రా సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమాచార మార్పిడి నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేయడం, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం భవిష్యత్ విజయానికి కీలకమని తెలిపారు.

ఎంటీఎక్స్ సంస్థ అభ్యాసం, అభివృద్ధి విభాగం సీనియర్ డైరెక్టర్ సాహిల్ బాత్రా మాట్లాడుతూ కళాశాల దశ నుంచే విద్యార్థులు తమ వృత్తి లక్ష్యాలను నిర్దేశించుకుని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నిరంతర అభ్యాసం వంటి అంశాలు ఉద్యోగ జీవితంలో విజయానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సంజయ్ ఎస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు దిశానిర్దేశం చేయడంలో 'ప్రారంభ్--2026' వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మొదటి సంవత్సరం నుంచే విద్యతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఎంటీఎక్స్ సంస్థ ప్రతినిధులు పరిశ్రమ అవసరాలు, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నూతన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి, వారి విద్యా ప్రస్థానం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. 'ప్రారంభ్--2026' ద్వారా నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు, వారి భవిష్యత్ విద్యా, వృత్తి ప్రయాణంపై స్పష్టమైన అవగాహన ఏర్పడింది.

## భూముల ఇచ్చే వారికి రిటర్నబుల్ ప్లాట్లు : కలెక్టర్ సాయికాంత్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రెండో విడత భూ సమీకరణలు భాగంగా భూములు ఇచ్చే వారికి రిటర్నబుల్ ప్లాట్లను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. తాడికొండ మండలం పెదపరిమిలో భూసమీకరణపై జరిగిన గ్రామసభలో తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్, పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక నగరంగా తీర్చిదిద్దుటకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకుగాను రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి అందరికీ తెలిసిందేనని చెప్పారు. భూ సమీకరణకు అందరూ సహకరించాలని కోరారు. ఎక్కువ మంది రైతులు భూ సమీకరణకు భూములను అందిస్తే వెంటనే పనులను చేపట్టకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను చూపించడమే కాకుండా వాస్తవికంగా భూమిపైకి వచ్చి వాటి సరిహద్దులను సైతం చూపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఆ మేరకు రిటర్నబుల్ ప్లాట్లను అందించడం జరుగుతుందని తెలిపారు.

తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ భూ సమీకరణపై సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఒక గొప్ప కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పెదపరిమిలో రైతుల సందేహాల నివృత్తికి గ్రీవెన్స్ ను నిర్వహించారు. భూముల అందించిన వారికి సంబంధిత పత్రాలను అందజేశారు. రైతుల సందేహాలను జిల్లా కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు అనధికారులు రైతులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లపై చర్చలు



- జేఏసీ ప్రతినిధులకు తెలియజేసిన ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ పరిధిలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రతినిధులతో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సోమవారం సాయంత్రం ప్రాథమిక స్థాయి చర్చలు నిర్వహించారు. తమ అపరిష్కృత డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న ఉద్యోగులతో తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, వైద్యారోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, ప్రజారోగ్య శాఖ సంచాలకులు పద్మావతి, వైద్య విద్య శాఖ అదనపు సంచాలకురాలు డాక్టర్ రాధికా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. జేఏసీ తరఫున కోటేశ్వరరావు, అజయ్‌కుమార్ సహా పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో మూడు గంటలకు పైగా జేఏసీ ప్రతినిధులతో చర్చించి, వారి సమస్యలను అధికారులు విపులంగా తెలుసుకున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. క్రమబద్ధీకరణ అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని అధికారులు వారికి వివరించినట్లు తెలిసింది. రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని, విధి నిర్వహణలో మరణించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

తమకు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) వర్తింపజేయాలని, రిక్వెస్ట్, పరస్పర (మ్యూచువల్) బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులకు తగిన భద్రత కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో వారి గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఆర్థికేతర అంశాలపై సానుకూల స్పందన :** జేఏసీ ప్రతినిధుల విజ్ఞప్తులపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, వైద్యారోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆర్థికేతర అంశాల పరిష్కారానికి శాఖాపరంగా అవసరమైన చర్యలను త్వరగా తీసుకుంటామని తెలిపారు. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీల అంశంపై అంతర్గత కమిటీతో చర్చించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు త్వరగా పంపేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాత్రి విధుల్లో స్టాఫ్ నర్సుల భద్రతతో పాటు, సిబ్బంది సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే వేతనాల పెంపు, ఎక్స్‌గ్రేషియా తదితర ఆర్థికపరమైన డిమాండ్లపై ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు జేఏసీ ప్రతినిధులకు తెలియజేశారు.

# సంచార జాతులకు సామాజిక న్యాయం అందించాలి

- వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక విధానం అవసరం
- ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది
- రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** సంచార, అర్ధ సంచార, విముక్త జాతులకు రాజ్యాంగ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రత్యేక విధానం రూపొందించి సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్నా సమాజంలోని అనేక వర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు పూర్తిస్థాయిలో అందలేదని, ముఖ్యంగా సంచార, అర్ధ సంచార, విముక్త జాతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందుతున్నప్పటికీ.. సంచార, అర్ధ సంచార, విముక్త జాతులపై సమగ్ర మదింపు, స్పష్టమైన వర్గీకరణ లేకపోవడం వల్ల అనేక తరాలు నష్టపోయాయని అన్నారు.

**'పుట్టుకతోనే నేరస్తులు'గా ముద్రవేశారు**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సంచార జాతుల పాత్ర ఎంతో కీలకమని పాకా వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. విదేశీ దాడులు, పరాయి పాలనల ప్రభావం ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతి మూలాలు నిలిచిపోవడంలో ఈ వర్గాల పాత్ర ఉందన్నారు. అయితే బ్రిటిష్ పాలకులు ఈ వర్గాలపై వివక్ష చూపి వారిని లిలి'పుట్టుకతోనే నేరస్తులు'లిలిగా ముద్రవేసి సమాజానికి దూరం చేసే విధానాలను అమలు చేశారని విమర్శించారు. ఈ విధానాల ప్రభావంతో సంచార, విముక్త జాతులు సామాజికంగా, ఆర్థికంగా తీవ్రంగా వెనుకబడిపోయాయని తెలిపారు.

**మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడుతోందని సత్యనారాయణ తెలిపారు. ఈ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు కమిషన్లు, కమిటీలు ఏర్పాటు చేసి నివేదికలు రూపొందించిన విషయాన్ని ప్రస్తావించారు.

వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో ఏ కేటగిరీకి చెందుతారనే విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల అనేక కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నాయని అన్నారు.

**స్థిర నివాసాలు.. వృత్తుల పరిరక్షణ**

సంచార జీవన విధానానికి ముగింపు పలికి ఈ వర్గాలకు స్థిర నివాసాలు కల్పించడం, తరతరాలుగా కొనసాగిస్తున్న సంప్రదాయ వృత్తులను పరిరక్షించడం, వాటికి ఆర్థిక సహకారం అందించడం అవసరమని పాకా వెంకట సత్యనారాయణ అన్నారు.

వారి జీవనోపాధిని బలోపేతం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనాభా మదింపు, కులాల వారీగా సమాచార సేకరణ నేపథ్యంలో సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల సమస్యలను సమగ్రంగా గుర్తించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**కేంద్రానికి నివేదిక అందజేస్తాం**

బాధ్యత కలిగిన రాజకీయ పార్టీగా భారతీయ జనతా పార్టీ సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకురావడానికి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగైదు ప్రాంతాల్లో సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో చర్చించిన అంశాలను క్రోడీకరించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వెల్లడించారు. వారి హక్కుల పరిరక్షణ, ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయం కోసం నూతన విధానాల రూపకల్పన దిశగా కృషి చేస్తామని పాకా వెంకట సత్యనారాయణ తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి కిలారి దిలీప్, బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌ఛార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, బలివాడ శివకుమార్ పట్నాయక్, చోరగండి శివలలిత, లాక వెంగళరావు యాదవ్, తుమ్మిలి రామకృష్ణ, హనుమంతురావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి

- టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌తోనే సంపద సృష్టి సాధ్యం
- ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న





**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. ఈ దిశగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అందిస్తున్న సాంకేతిక సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆడిటోరియంలో 'మెంటార్ మ్యాపింగ్--క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్ బృందం ఏర్పాటు' అంశంపై క్వాంటమ్, ఏఐ ఇన్నోవేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల నుంచి 300 మందికి పైగా టెక్నాలజీ నిపుణులు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, ఇండస్ట్రీ భాగస్వాములు, వివిధ కళాశాలల అధ్యాపకులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల అభివృద్ధికి యూనివర్సిటీ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ ఏడాది వర్సిటీలో క్వాంటమ్, ఏఐ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రారంభించామని, క్వాంటమ్ రంగంలో పరిశోధనలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఎన్విడియా, ఫ్యాబ్‌ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో అత్యంత వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేథస్సు కీలకంగా మారుతున్న నేపథ్యంలో పరిశోధనలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.

సంపద సృష్టికి నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకత ఎంతో అవసరమని, టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఎదురవుతున్న వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించే దిశగా కొత్త ఆల్గారిథమ్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఆంధ్రా యూనివర్సిటీలో వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు.

**భవిష్యత్ కార్యాచరణపై చర్చ**

ఈ సందర్భంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మిషన్ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం నిర్వహించిన వర్క్‌షాప్‌లో క్వాంటమ్ టెక్నాలజీ వినియోగానికి ఉన్న వివిధ అవకాశాలను గుర్తించడం, ఆయా రంగాలకు తగిన మెంటార్లను అనుసంధానం చేయడం, భవిష్యత్ ప్రాజెక్టులకు అవసరమైన నిపుణులను ఎంపిక చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో క్వాంటమ్ వ్యాలీ మిషన్ ప్రతినిధి తాడికొండ వెంకటస్వామి, క్వాంటమ్ ఇండియా-ఐబీఎం లీడ్ శేషరఘునాథన్, క్వాంటమ్ ఇండియా-టీసీఎస్ లీడ్ గ్రాడ్ ఫ్రే మతాల్స్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467